

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
శుక్రవారం 29 నవంబరు 2024



రేపు జిల్లాకు సీఎం చంద్రబాబు
- నేమకల్లులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ
- గ్రామ ప్రజలతో సమావేశం.. అర్జీల స్వీకరణ
6



అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్
- సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ
- జిల్లాకు పరిశ్రమలు తీసుకొస్తాం
- డీఆర్‌సీ సమావేశంలో మంత్రులు టీజీ భరత్, కేశవ్
7



చీమల పుట్టలో పాములు





ఆర్డీటీ కాలనీ వ్యూ

వైసీపీ హయాంలో దురాక్రమణలు

- ఇందిరమ్మ ఇళ్లను ఆక్రమించి విక్రయం
- నకిలీ డాక్యుమెంట్లు.. ఫోర్జరీ సంతకాలు
- న్యాయం కోసం ఎదురుచూస్తున్న బాధితులు



తాడిపత్రి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సొంతిల్లు పేదలకు ఓ కల. స్థలాలను కొనే పరిస్థితి లేదు. ఇంటిని నిర్మించుకోవడం అయ్యేపని కాదు. ఇలాంటి వారికి ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయి. స్థలాలను కేటాయించి, ఇంటిని నిర్మించి ఇస్తున్నాయి. కానీ వైసీపీ హయాంలో ఇళ్ల నిర్మాణం అటుంచితే.. గత ప్రభుత్వాలు నిర్మించి ఇచ్చిన ఇళ్లను ఆక్రమించారు. నకిలీ పత్రాలు, ఫోర్జరీ సంతకాలతో అమ్మేశారు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించలేదు. తాడిపత్రిలోని ఆర్డీటీ కాలనీ సహా పలు ప్రాంతాలలో పేదల ఇళ్లు, ఇంటి స్థలాలు భారీగా కబ్జాకు గురయ్యాయి. కూటమి ప్రభుత్వం విచారించి.. తమకు న్యాయం చేయాలని బాధితులు వేడుకుంటున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కబ్జా

తాడిపత్రి పట్టణవాసులకు ఇందిరమ్మ పథకం-2 కింద సుమారు 304 ఇళ్లను అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. ఆర్డీటీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని ఇళ్ల నిర్మాణం పూర్తి చేసింది. కానీ ఆ ఇళ్లలో లబ్ధిదారుల చేరిక వివిధ కారణాలతో జాప్యం అయింది. వైసీపీ అధికారంలోకి రాగానే ఆ ఇళ్లను, మిగిలిన స్థలాలను కబ్జా చేశారు. ఇళ్లను ఆక్రమించడంతో పాటు నకిలీ పేర్లతో పేపర్లు సృష్టించి రియల్ వ్యాపారం చేశారు. ఇలాంటివి పదుల సంఖ్యలో ఉన్నాయి.

ఎందరో బాధితులు

- పట్టణానికి చెందిన రమణయ్య (తండ్రి సూరప్ప) పేరిట ప్లాట్ నంబరు 300 కేటాయించారు. అతని పేరిట ఇల్లు మంజూరైంది. వైసీపీ కార్యకర్త షెక్షావలి.. ఫోర్జరీ చేసి, ఇంటి మంజూరు పత్రం సృష్టించారు. రమణయ్య అమ్మినట్లుగా తనకు తానే అగ్రిమెంట్ రాసుకుని.. సచివాలయం అధికారులను బురిడీ కొట్టించాడు. ఓటీఎస్ పత్రాలు సృష్టించుకున్నాడు. కొన్న అగ్రిమెంట్‌లో, ప్రొసిడింగ్‌లో రమణయ్య తండ్రి పేరులో తేడా ఉంది.
- ప్లాట్ నంబరు 442 సి.అనసూయ భర్త సి.నాగేశ్వరావు పేరిట ఉంది. వైసీపీ అధికారంలోకి రాగానే ఇంటి తాళాలు పగలగొట్టి సుందరయ్య అనే వ్యక్తి కుటుంబం ఆక్రమించింది. ఇల్లు అనసూయకు మంజూరు కాగా, నాగేశ్వరావు అనే వ్యక్తి అమ్మినట్లు ఫోర్జరీ అగ్రిమెంట్ రాసుకున్నారని తెలిసింది. అనసూయకు గత ప్రభుత్వం ఓటీఎస్ కింద రిజిస్ట్రేషన్ కూడా చేసింది. అయినా ఆక్రమణదారుడు ఇల్లు ఖాళీ చేయకుండా అధికారులను సైతం బెదిరించినట్లు తెలుస్తోంది.
- ప్లాట్ నంబరు 304 బి.రామకృష్ణ తండ్రి బి.కంబగిరి అనే పేరిట ఉంది. వైసీపీ హయాంలో ఆ పార్టీ నేతల అండతో కొందరు ఈ ఇంటికి నకిలీ పత్రాలు సృష్టించారు. రూ.4.20లక్షలకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు.
- ప్లాట్ నంబరు 310 చెన్నా రమేష్ తండ్రి నారాయణ పేరిట మంజూరైంది. వైసీపీ హయాంలో ఎస్.సారక్క పేరుతో నకిలీ పట్టాలు సృష్టించారు. వీరి నుంచి మరొకరు కొన్నట్లు డ్రామా ఆడి, షేక్ మహబూబ్‌బీ అనే మహిళ ఓనర్‌గా చూపించారు. ఆ ఇంటిని లక్షలకు అమ్మి సొమ్ము చేసుకున్నారు.
- ప్లాట్ నంబరు 583 జి వెంకటరాముడు తండ్రి హనుమంతు పేరిట మంజూరైంది. వైసీపీ నాయకుడి అనుచరుడు ఆక్రమించి, బాలకృష్ణ అనే వ్యక్తిని ఆ ఇంటిలో ఉంచారు. న్యాయపోరాటం చేయడంతో కొన్నాళ్ల క్రితం వెంకటరాముడుకు ఇల్లు దక్కింది.
- ప్లాట్ నంబరు 497 రజియా సుల్తానాకు మంజూరు అయింది. ఆ ఇంటిని వైసీపీ నాయకుడి అనుచరుడు దౌర్జన్యంగా ఆక్రమించాడు. తాడిపత్రి మున్సిపాలిటీ పరిధిలోని విశ్రాంత హెచ్‌ఎంకు విక్రయించాడు.
- ప్లాట్ నంబరు 577 పి. సయ్యద్‌వలికి, ప్లాట్ నంబరు 737 టి.గంగమ్మకు, ప్లాట్ నంబరు 598 లక్మయ్యకు, ప్లాట్ నంబరు 862 పి.లక్ష్మీదేవికి మంజూరయ్యాయి. వీటన్నింటినీ వైసీపీ నాయకులు ఆక్రమించారు.

భారీగా బోగస్ పట్టాలు

పేదలకు ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థలాలకు నకిలీ పట్టాలను సృష్టించారు. ఒక సెంటు పట్టాలు పొందినట్లు చూపిస్తూ దొంగ పత్రాలు సృష్టించుకున్నారు. గన్నెవారిపల్లి, తిప్పారెడ్డిపల్లి.. ఇలా వేరేచోట సర్వే నంబర్లను వేసుకొని భర్త భార్యకు అమ్మినట్లు, భార్యకు భర్త అమ్మినట్లు పత్రాలు సృష్టించుకుని కబ్జా చేశారు. కొందరు ప్రభుత్వ ఓపెన్ రిజర్వ్‌స్థలాలను ఆక్రమించి భారీ భవంతులను నిర్మించారు. మరికొందరు వామపక్షాల పేరుతో స్థలాలు ఆక్రమించి ఇళ్లు కడుతున్నారు.



కబ్జా అయిన ఇల్లు

విచారించిన మున్సిపల్ చైర్మన్

పేదలకు కేటాయించిన ఇంటి స్థలాలు, ఇళ్ల ఆక్రమణల గురించి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆరా తీశారు. ఇటీవల సచివాలయ సిబ్బందిని పిలిపించి వివరాలు తెలుసుకున్నారు. వారిచేత విచారణ జరిపించారు. ఈ క్రమంలో చాలా అక్రమాలు బయటకు వచ్చినట్లు సమాచారం. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.



దౌర్జన్యంగా ఆక్రమించారు..

కాంగ్రెస్ హయాంలో నా భార్య అనసూయ పేరు మీద ఇందిరమ్మ పథకం కింద ఇల్లు కట్టించి ఇచ్చారు. ఇంటిలో చేరుకున్నాము. బండిమీద వ్యాపారం చేసుకొని జీవనం సాగించేవాళ్లం. కొన్ని కారణాల వల్ల ఇబ్బందులు ఎదురుకావడంతో ఇంటికి తాళం వేసి పట్టణంలోకి వచ్చి వ్యాపారం చేసుకుంటున్నాను. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో వైసీపీ ప్రభుత్వంలో నా ఇంటి తాళం పగలగొట్టి ఆక్రమించుకున్నారు. అధికారులకు చెప్పినా నాకు న్యాయం చేయలేదు.

-నాగేశ్వరరావు

ఫోర్జరీ చేశారు..

ఇందిరమ్మ పథకం కింద మాకు ఇల్లు కట్టించి ఇచ్చారు. కరోనా సమయంలో మేము ఇంటిని వదిలి పట్టణంలోకి వచ్చాం. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తాళం పగలగొట్టి ఆక్రమించుకున్నారు. దొంగపత్రాలు సృష్టించారు. ఫోర్జరీ సంతకాలతో నా ఇంటిని కబ్జాచేశారు. వైసీపీ నాయకుల అండతో మాకు అన్యాయం చేశారు.

-రమణయ్య



గ్రావెల్ దందాపై విచారణ

- కొలతలు తీసిన అధికారులు
- నేడు కొనసాగనున్న విచారణ



వైసీపీ మండల కన్వీనర్‌ను విచారిస్తున్న అధికారులు

యాడికి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడి గ్రావెల్ దందాపై అధికారులు గురువారం విచారించారు. మైన్స్ అండ్ జియాలజీ, విజిలెన్స్, రెవెన్యూ, దేవదాయశాఖ అధికారులు క్షేత్రస్థాయికి వచ్చారు. పెద్దపేట ఆంజనేయస్వామి మాన్యం వద్ద తవ్వకాలను పరిశీలించారు. వైసీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, ఆయనపై ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకులు వేలూరు రంగయ్య, లక్ష్మీనారాయణ, ఆదినారాయణతో అధికారులు విడివిడిగా మాట్లాడారు. సర్వే నంబరు 753-1లో ఎంత గ్రావెల్‌ను తరలించారో సర్వే చేశారు. భైరవకొండపై సర్వే చేశారు. తిరుణాంపల్లి వంకలో ఎంతమేరకు గ్రావెల్ తరలించారో సర్వే చేశారు. వీటన్నింటిపై నివేదిక తయారుచేసే పనిలో నిమగ్నమయ్యారు. విజిలెన్స్ ఏజీ అనిల్‌బాబు, సీఐ జమాల్ బాషా, మైన్స్ అండ్ జియాలజీ తాడిపత్రి ఏడీ ఓబులరెడ్డి, యాడికి తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ వీరరాజు, ట్రాన్స్‌కో ఏఈ రాజారావు, ఎండోమెంట్ ఈఓ దుర్గాప్రసాద్, సర్వేయర్లు పాల్గొన్నారు.

టవర్ కూలితే..

పెద్దపేట ఆంజనేయస్వామి మాన్యంలో ట్రాన్స్‌మిషన్ టవర్ చుట్టూ గ్రావెల్ తవ్వకాలు జరిగాయి. దీంతో టవర్ కూలితే ఎంత నష్టం సంభవిస్తుంది అని ట్రాన్స్‌కో ఏఈ రాజారావును అధికారులు అడిగారు. టవర్ ఏర్పాటుకు సుమారు రెండు కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని ఆయన తెలిపారు. టవర్ కూలితే దానికి అనుసంధానంగా ఉన్న మరో రెండు మూడు టవర్లు కూలుతాయని వివరించారు. కూలినవాటి పునరుద్ధరణకు 15 రోజులు సమయం పడుతుందని తెలిపారు. గ్రావెల్ తవ్వకం కారణంగా ప్రమాదపుటంచుకు చేరుకున్న ట్రాన్స్ మిషన్ టవర్ కూలితే యాడికి, తాడిపత్రి, పెద్దపప్పూరు మండలాల్లో కరెంట్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. బొంబాయి రమేష్‌నాయుడు అక్రమంగా వేసిన లే అవుట్లలోకి ఎంత మొత్తంలో గ్రావెల్ తరలించారనేదీ శుక్రవారం తేలుస్తామని అధికారులు తెలిపారు. విచారణ తరువాత సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తహసీల్దారు ప్రతాప్ రెడ్డి తెలిపారు.



పూలేకి నివాళులు అర్పిస్తున్నమంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తదితరులు

మార్పునకు శ్రీకారం చుట్టిన మహనీయుడు

పూలేకి ఆర్థిక మంత్రి కేశవ్ ఘన నివాళి

అనంతపురం అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సమాజంలో మార్పునకు శ్రీకారం చుట్టిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కొనియాడారు. జ్యోతిరావు పూలే 134వ వర్ధంతిని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. జడ్పీ ఆవరణలోని పూలే విగ్రహానికి మంత్రి కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, బండారు శ్రావణి శ్రీ, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, మేయర్ వసీం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. సమాజంలో మార్పు తెచ్చిన, స్ఫూర్తిని నింపిన వ్యక్తులను స్మరించుకోవడం మన బాధ్యత అని ఈ సందర్భంగా కేశవ్ అన్నారు. అణగారిన వర్గాలను సమాజంలో వేరుచేసి చూస్తున్న రోజుల్లోనే తన భార్యతో కలిసి మార్పు దిశగా ప్రయాణాన్ని ప్రారంభించారని అన్నారు. దేశంలో మంచి సమాజ నిర్మాణానికి కృషి చేసినవారి చరిత్రను పాఠ్యాంశాల్లో చేరిస్తే స్ఫూర్తిని నింపుతాయని అన్నారు. సామాజిక అంతరాలను తొలగించేందుకు మొట్టమొదట ప్రయత్నం చేసిన మహనీయుడు పూలే అని కాలవ శ్రీనివాసులు అన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో పూలే ఆశయాలను కొనసాగించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. సమాజంలో ఆర్థిక, సామాజిక అంతరాలను తొలగించేందుకు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషిచేస్తామని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూకొఠారి, సూపరింటెండెట్ నాగరత్నమ్మ, ఏబీసీడబ్ల్యూఓ సుభాషిణి, బీసీ వార్డెన్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మస్తాన్, జిల్లా అధ్యక్షుడు మారుతీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు పెరిగేలా చూడండి: అంబికా

అనంతపురం అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కరువు జిల్లా అనంతకు ఉపాధి హామీ నిధులు మరిన్ని మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్‌కు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ విన్నవించారు. ఢిల్లీలో గురువారం డిప్యూటీ సీఎంను అంబికా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కూలీలకు ఎక్కువ పనిదినాలు కల్పించేలా చూడాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ కుటుంబాలకు అదనపు పనిదినాలు కల్పించాలన్నారు. పనిచేసే ప్రాంతాల్లో కూలీలకు తగు సదుపాయాలు ఉండేలా చూడాలని కోరారు. 15వ ఆర్థిక సంఘం నిధులను పెంచి, జడ్పీ ద్వారా గ్రామ స్థాయిలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని విన్నవించారు. గ్రామాలు, పట్టణాలకు జలజీవన్ మిషన్ నిధులను పెంచాలని, ప్రతి ఇంటికి తాగునీరు అందించాలని కోరారు.



పవన్‌కల్యాణ్‌ను కలిసిన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

కల నెరవేరేనా..!

- మైనార్టీ గురుకులానికి ప్రతిపాదనలు
- టీడీపీ హయాంలో స్థలం, నిధుల కేటాయింపు
- ప్రభుత్వం మారడంతో మరుగున పడిన అంశం
- కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో కదలిక



పండమేరులో మైనార్టీ గురుకుల పాఠశాలకు కేటాయించిన స్థలంలో ఏపుగా పెరిగిన ముళ్లకంపలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మైనార్టీ గురుకుల పాఠశాల ఏర్పాటు అంశం మరోమారు తెరపైకి వచ్చింది. టీడీపీ హయాంలో మైనార్టీ సంఘాల నాయకుల పోరాటాల ఫలితంగా గురుకుల పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అప్పట్లో 6.80 ఎకరాల స్థలం, రూ.17.20 కోట్ల నిధులను మంజూరు చేసింది. పనులు ప్రారంభించే సమయంలో ఎన్నికలు రావడం, ఆ తరువాత వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ అంశం మరుగున పడింది. మైనార్టీల గురుకుల పాఠశాల నిర్మాణం కలగానే మిగిలిపోయింది. వైసీపీ హయాంలో మైనార్టీ నాయకులు ధర్నాలు, నిరసనలు చేపట్టినా స్పందన లభించలేదు. అప్పటి ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో మైనార్టీ విద్యార్థులలో ఆశలు చిగురిస్తున్నాయి.

ఎన్నెన్నో అడ్డంకులు..

మైనార్టీ గురుకుల పాఠశాల నిర్మాణం కోసం ఉప్పరపల్లిలో టీడీపీ ప్రభుత్వం స్థలాన్ని కేటాయించింది. కానీ స్థానికులు ప్రైవేటు భూమి అని అడ్డుచెప్పడంతో విరమించుకుంది. ఆ తరువాత రాప్తాడు నియోజకవర్గంలోని పండమేరు వద్ద ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కేటాయించింది. దాదాపు 6.80 ఎకరాల స్థలంలో అన్ని రకాల హంగులతో భవంతిని నిర్మించేందుకు రూ.17.20 కోట్లు విడుదల చేసింది. ఆ సమయంలో రాజకీయపరమైన అడ్డంకులు ఎదురయ్యాయి. పండమేరు రాప్తాడు నియోజకవర్గం పరిధిలో ఉంది. కానీ అక్కడ కేటాయించిన స్థలం అనంతపురం నగరపాలిక ఆస్తి. గతంలో ఉన్న ప్రజాప్రతినిధులు ఆ పనులు దక్కించుకునేందుకు పోటీ పడ్డారు. దీంతో పనుల ప్రారంభంలో జాప్యం జరిగింది. ఆ తరువాత ఎన్నికలు సమీపించడం, ప్రభుత్వం మారడంతో మైనార్టీ గురుకుల పాఠశాల మాటే వినపడలేదు. ప్రభుత్వం కేటాయించిన స్థలం ముళ్ల పొదలతో నిండిపోయింది. హద్దులు కూడా చూపకపోవడంతో కొందరు కబ్జాదారులు కన్నేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినందున వెంటనే గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులను ప్రారంభించాలని మైనార్టీ సంఘాల నాయకులు కోరుతున్నారు. లేదంటే ఆ స్థలం అన్యాక్రాంతం అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏర్పాటవుతుంది..

టీడీపీ ప్రభుత్వం మైనార్టీ గురుకుల పాఠశాలకు స్థలం, నిధులను కేటాయించింది. కానీ ప్రభుత్వం మారడంతో ఆ పనులు ముందుకు సాగలేదు. వైసీపీ పాలనలో నాశనం చేశారు. ఒక పిల్లర్ కూడా వేయలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో మైనార్టీ పాఠశాల నిర్మాణంపై ఆశలు పెరిగాయి. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ప్రభుత్వ సలహాదారు షరీఫ్ సహకారం అందిస్తున్నారు. ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ఖచ్చితంగా మైనార్టీ గురుకుల పాఠశాల భవన నిర్మాణం పూర్తవుతుంది.

- తాజుద్దీన్, టీడీపీ మైనార్టీ సెల్ నాయకుడు

నివేదికలు పంపాం...

మైనార్టీ గురుకుల పాఠశాల నిర్మాణం కోసం పైస్థాయి అధికారులకు నివేదిక పంపించాము. భవనం పనులు, స్థలం, హద్దులు, వ్యయం అంచనా తదితర వివరాలను ఉన్నతాధికారులకు అందజేశాము. పై నుంచి ఉత్తర్వులు అందిన వెంటనే కలెక్టర్ అనుమతులతో పాఠశాల భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

- రామసుబ్బారెడ్డి, ఏడీ, మైనార్టీ సంక్షేమశాఖ

న్యూస్‌బాక్స్

ఇంటర్ ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

అనంతపురం విద్య/కొత్తచెరువు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువు వచ్చే నెల 5వ తేదీ వరకూ పొడిగించినట్లు అనంత, శ్రీసత్యసాయి జిల్లా ఆర్ఐఓలు వెంకటరమణ నాయక్, రఘునాథరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఈ విషయాన్ని విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు. మళ్లీ గడువు పొడిగించే అవకాశం ఉండదని, విద్యార్థులను అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచడానికి సంకల్ప్-2025 కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. డిసెంబరు 1 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు ఈ కార్యక్రమం అమలు చేస్తామని తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు సాయంత్రం 4 గంటల నుంచి 5గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తామని తెలిపారు. యూనిట్ టెస్టులను డిసెంబరు 2 నుంచి 4వతేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు.

8న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

అనంతపురం విద్య, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపకార వేతన (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షలు డిసెంబరు 8వ తేదీ నిర్వహించనున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతాయన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కార్యాలయ వెబ్‌సైట్ www.bse.ap.go v.in నుంచి స్కూల్ లాగిన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. సంబంధిత స్కూల్ ప్రధానోపాధ్యాయులు పాఠశాల యూ-డైస్ కోడ్‌ను ఉపయోగించి లాగిన్ అయ్యి తమ స్కూల్ విద్యార్థుల హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందజేయాలన్నారు. మరిన్ని వివరాల కోసం కమలానగర్‌లోని పాత డీఈఓ కార్యాలయంలోని పరీక్షల విభాగం అధికారులను సంప్రదించాలని సూచించారు.

1న హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు డిసెంబరు 1వతేదీన కళ్యాణదుర్గంలోని కరణం చిక్కప్ప ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సాకే శివశంకర్ గురువారం ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు జనన ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడాసామగ్రి, యూనిఫాంతో హాజరుకావాలన్నారు. ఎంపికైన వారు డిసెంబరు రెండో వారంలో నిర్వహించే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాలకు 8978137522, 7013572439 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

శబరిమలకు ప్రత్యేక రైలు

గుంతకల్లు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గుంతకల్లు మీదుగా శబరిమలకు ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మౌలాలి-కొల్లాం (నం. 07141) ప్రత్యేక రైలు డిసెంబరు 7వ తేదీ మధ్యాహ్నం 2-45 గంటలకు మౌలాలీ స్టేషన్‌లో బయలుదేరి మరుసటిరోజు రాత్రి పదిన్నరకు కొల్లాంకు చేరుతుందని తెలిపారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07142) కొల్లాంలో డిసెంబరు 9వ తేదీ తెల్లవారు జాము రెండున్నరకు బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం ఒంటి గంటలకు మౌలాలీ స్టేషన్‌కు చేరుతుందని తెలియజేశారు. ఈ రైలు సికింద్రాబాద్, బేగంపేట, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, సేరం, యాద్గిర్, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, గుత్తి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పట్టి, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, కోయంబత్తూరు, పొదనూరు, పలక్కడ్, త్రిసూర్, అలువ, ఎర్నాకులం టౌన్, కొట్టాయం, చెంగనచేరి, తిరువల్ల, చెంగనూరు, కళ్యాణికులం స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు.

ఎంపీఈఓలకు పోస్టింగ్‌లు ఖరారు

అనంతపురం అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): చిత్తూరులో ఓడీపై పనిచేసి తిరిగి జిల్లాకు వచ్చిన 48 మంది ఎంపీఈఓలకు వ్యవసాయ శాఖలో పోస్టింగ్‌లు ఇచ్చారు. వారు ఇచ్చిన ఆప్షన్ల మేరకు స్థానాలను ఖరారు చేశారు. జేడీఏ ఉమామహేశ్వరమ్మ గురువారం పోస్టింగ్‌లు ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కేటాయించిన స్థానాల్లో తక్షణమే చేరాలని ఆదేశించారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది క్రమబద్ధీకరణ ప్రక్రియను ప్రభుత్వం త్వరలో చేపట్టబోతోంది. ఇదివరకే మండలాల వారిగా పంటల సాగు విస్తీర్ణం, ఎంత మంది సిబ్బంది కావాలన్న వివరాలను వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు పంపారు. ఒక్కో ఉద్యోగికి 1100 ఎకరాల నుంచి 3 వేల ఎకరాల విస్తీర్ణం అప్పగిస్తారని సమాచారం. పలు మండలాల్లో అదనంగా ఉన్న సిబ్బందిని క్రమబద్ధీకరణలో అవసరమున్న ప్రాంతాలకు పంపనున్నారు. తద్వారా ఈ-పంట నమోదు, ఇతర పనులు త్వరగా చేసేందుకు అవకాశం ఉంటుంది.

దహనం


సూర్యనగర్‌లో...

చలి వణికిస్తోంది..!
ఎవరికి ముద్దు..?
ముద్ద చేతికి అందాలంటే..
కాలం ఏదైనా కష్టపడాల్సిందే..
పొద్దు పొడవకనే
వేటకు వెళ్లాల్సిందే..!

రోడ్డుపై చెత్త..
కడుపులో పేగులు..
రెండింటికీ మంటలు..!
భిన్నమైన చలిమంటలు..!


కలెక్టరేట్ వద్ద..


రుద్రంపేటలో...

(అనంతలో గురువారం వేకువ జామున..)

ముంపు నియంత్రణ..!

వరదనీటికి అడ్డుకట్ట వేసేలా చర్యలు

- పండమేరు, తడకలేరు, నడిమివంక ప్రవాహంపై దృష్టి
- పరివాహక ప్రాంతాల్లో 688 పనుల గుర్తింపు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వర్షం నీరు నగరంలోకి ప్రవేశించకుండా, పక్కకు మళ్లించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇటీవల కురిసిన భారీ వర్షాల కు వరదబారిన పడిన కాలనీల దుస్థితిని సవాల్‌గా తీసుకున్న జిల్లా యంత్రాంగం ఈ ప్రణాళిక లకు శ్రీకారం చుట్టింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఈ పనులు చేయాలని నిర్ణయించారు. పండమేరు, నడిమివంక, తడక లేరు, మరువవంకలలో వరదనీరు అధికమై నగరంలోకి ప్రవేశించి సమీప కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. వరదనీటికి అడ్డుకట్టవేసేందుకు అనంతపురం రూరల్, ఆత్మకూరు, బుక్కరాయసముద్రం, రాప్తా డు మండలాల్లో మొత్తం 688పనులను గుర్తించారు. ఆయా మండలాల్లో పడే వర్షం నీరు అక్కడే భూమిలోకి ఇంకేట్లుచేయడం ఒకటి. అలాగే నీటిని నదులలోకి, చెరువులలోకి మళ్లించడంపై మార్గాలను అన్వేషించా రు. ఉపాధి, వాటర్ షెడ్ పథకాల ద్వారా కాలువలు, కుంటల తవ్వకం, పూడికతీత పనులు చేపట్టాలని నిర్ణయించారు. డ్వామా, భూగర్భజల శాఖ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖ, అగ్రికల్చర్ శాఖలను సమన్వ యంతో పనులు చేయాలని ప్రభుత్వం సూచించింది. ఇందుకు డ్వామాను నోడల్ శాఖగా గుర్తించారు. పనులు చేపట్టేందుకు అంచనా వ్యయ ప్రతిపాదనలు సిద్ధం చేసే


పండమేరు వంక

పనిలో వారు నిమగ్నమయ్యారు.

నాలుగు వంకలతోనే వరద ముప్పు

నగరంలోకి ప్రధానంగా నాలుగు వంకలతోనే వరద ముప్పు వాటిల్లు తోంది. పండమేరు కనగానపల్లి ప్రాంతంలో ప్రారంభమై సుమారు 63 కిలోమీటర్లు ప్రవహించి బుక్కరాయసముద్రం చెరువులో కలుస్తుంది. తడకలేరు కూడేరు మండలంలో ప్రారంభమై 28కిలోమీటర్ల మేర ప్రవహించి సోమలదొడ్డి వద్ద చెరువులో కలుస్తుంది. నడిమివంక కాలవ ఆత్మకూరు మండలం సనపవద్ద ప్రారంభమై సుమారు 38కిలోమీటర్లు ప్రవహించి సోమలదొడ్డి వద్ద తడకలేరులోకి కలుస్తుంది. ఇక మరువవంక నగరంలోని పాతూరులో చెరువుకట్ట కింద ప్రారంభమై ఆరు కిలోమీటర్లు ప్రవహించి సోములదొడ్డి వద్ద తడకలేరు వాగులోకి కలుస్తుంది. ఈ నాలుగు వాగుల పరివాహక ప్రాంతాల పైభాగంలో వాననీటి సంరక్షణ పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు.

నాలుగు మండలాల్లో పనులు

నగరంలోకి వచ్చే వరదనీటికి అడ్డుకట్ట వేసేందుకు అనంతపురం రూరల్, ఆత్మకూరు, రాప్తాడు, బుక్కరాయసముద్రం మండలాల్లో పను లు చేపడుతారు. ఆయా మండలాల్లో ఫారంపాండ్స్, డగవుట్‌పాండ్స్, బౌండరీట్రెంచ్‌లు, క్యాటింగ్ పాండ్స్ నిర్మాణం చేపట్టను న్నారు. అదే విధంగా కుంటలు, వాగులు, వంకలు, చెక్‌డ్యాంల్లో పూడికతీత పనులు చేపట్టి అధికనీటి నిల్వకు చర్యలు చేపట్టనున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే 688పనులను గుర్తించారు. రూరల్ మండల పరిధిలో నడిమివంక, పండమేరు, తడకలేరు వాగులలో 163పనులు చేపట్టనున్నారు. ఆత్మకూరు మండలం లోని నడిమివంక, తడకలేరు వాగులలో 173, బుక్కరాయసముద్రం మండలంలోని తడక లేరులో 26, రాప్తాడు మండలంలోని నడిమివంక, పండమేరు వాగులలో 326పనులు గుర్తించారు. మొత్తంగా నడిమివంక పరిధిలో 141పనులు, పండమేరు పరిధిలో 307, తడకలేరు వాగులో 240పనులు గుర్తించారు.

అంచనాలు తయారు చేసే పనిలో ఉన్నాం

- సలీంబాషా, డ్వామా పీడీ

ప్రధానంగా నగరంలోకి ప్రవేశించే వరద నీటి కాలనీలు ముంపున కు గురిగాకుండా రక్షించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. ఉపాధి నిధుల ద్వారా చేపట్టే 688పనులు గుర్తించాం. పనులకు సంబంధించి అంచనాలు తయారు చేసే పనిలో ఉన్నాం. వారం రోజుల్లో పనుల అంచనాలు తయారు చేసి కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపుతాం. ఆమోదం తెలిపిన వెంటనే గుర్తించిన పనులను చేపడుతాం. నిర్ణీత గడువు విధించి సకాలంలో పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. సంబంధిత శాఖలను సమన్వయం చేసుకుని వెళతాం.

ఉల్లి రైతుకు కన్నీరు


అబ్బేదొడ్డిలో తుఫాన్‌తో దెబ్బ తిన్న ఉల్లి పంట

- తుఫాన్ల దెబ్బకి కుళ్లిన పంట
- పెట్టుబడి కూడా రాని దుస్థితి
- కుమిలిపోతున్న అన్నదాతలు

గుత్తిరూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉల్లిపంట రైతులకు కంటనీరు తెప్పిస్తోంది. గత రెండు నెలల క్రితం మండలంలోని చాలా గ్రామాల్లో రైతులు ఉల్లిని సాగు చేయగా.. ఇటీవల తుఫాన్ల దెబ్బకి పంటంతా కుళ్లిపోయింది. దీంతో పెట్టుబడి కూడా చేతికందే పరిస్థితి లేకపోవడంతో రైతులు కంటనీరు పెడుతున్నారు. ముఖ్యంగా కొత్తపేట, కరిడికొండ, పెద్దొడి, పూలకుంట, రజాపురం, శ్రీపురం, చెర్లోపల్లి, బసినేపల్లి తండా తదితర గ్రామాల్లో బోరుబావులున్న రైతులు ఉల్లి పంటను సాగు చేశారు. ఇందుకు ఎకరాకు రూ.85 వేల నుంచి రూ. 95 వేల వరకు పెట్టుబడి పెట్టారు. బాగా పండితే ఎకరాకు 80 నుంచి 90 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం ఉల్లి ధర కూడా క్వింటా రూ.5 వేలు పలుకుతోంది. రూ. 2వేలకు పైగా పలికినా రైతుల పెట్టుబడులు పోను ఎకరాకు రూ.70 వేల నుంచి రూ. 80వేల వరకు ఆదాయం వస్తుంది. దీంతో అన్నీ బాగున్నాయనుకుని రైతులు ఎన్నో ఆశలతో ఉల్లి పంట సాగు చేశారు. అయితే తుఫాన్ వారి ఆశల్ని అడియాసలు చేసింది. పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు మొదలయ్యాయి. సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో తుఫాన్లు ఎడతెరపి లేకుండా వచ్చాయి. వాటి దెబ్బకి తేమ శాతం అధికమై ఉల్లి పంట పొలాల్లోనే కుళ్లిపోయింది. దీంతో దిగుబడి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులు కుమిలిపోతున్నారు. చేసేదిలేక రైతులు అకరొకగా పండిన పంటను సైతం పొలాల్లోనే వదిలేశారు.

తుఫాన్ దెబ్బకు పంట కుళ్లిపోయింది

- సుధాకర్, రైతు, కొత్తపేట



రెండు ఎకరాలో ఉల్లి పంటను సాగు చేశాను. ఉల్లికి కొంత మేర ధర ఉండేది. అందుకోసం సెప్టెంబరు మాసంలో ఉల్లి సాగు చేశాను. తుఫాన్ దెబ్బకి పంట చాలావరకు కుళ్లిపోయింది. దీంతో దిగుబడి వస్తుందో లేదో దిక్కు తోచని పరిస్థితి నెలకొంది. భారీ పెట్టుబడి పెట్టాను. ప్రస్తుతం ఉల్లి పంట చిన్న చిన్న గడ్డలతో ఉంది.


పొలంలోనే వదిలేసిన ఉల్లి పంట

పంటను దున్నేశా:

గోవిందునాయక్, రైతు, బసినేపల్లి తండా



నేను ఎకరాలో బోరుబావుల కింద ఉల్లి పంటను సాగు చేశాను. ఎంతో కష్టపడి పెట్టుబడి పెట్టాను. సెప్టెంబరు మాసంలో తుఫాన్ దెబ్బకి పొలంలోనే పంట కుళ్లి పోయింది. వాటిని దున్నేశాను. రూ.40 వేల వరకు నష్టపోయాను. తర్వాత వాటిలోనే మళ్లీ ఉల్లి పంటను సాగు చేశాను.

రేపు జిల్లాకు సీఎం చంద్రబాబు

నేమకల్లులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

గ్రామ ప్రజలతో సమావేశం.. అర్జీల స్వీకరణ

అనంతపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం జిల్లాకు వస్తున్నారు. ఒకరోజు పర్యటనలో భాగంగా బొమ్మనహాల్ మండలం నేమకల్లు ఇందిరమ్మ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేస్తారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత స్వయంగా ముఖ్యమంత్రి పింఛన్ల పంపిణీలో భాగస్వాములవుతున్నారు. రచ్చబండ తరహాలో నేమకల్లు గ్రామ ప్రజలతో ముఖ్యమంత్రి సమావేశమౌతారు.

సీఎం పర్యటన షెడ్యూల్

- శనివారం ఉదయం 11 గంటలకు: తాడేపల్లిలోని నివాసం నుంచి రోడ్డు మార్గాన విజయవాడ విమానాశ్రాయానికి బయలుదేరుతారు.
- 11.40: విజయవాడ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో బయలుదేరి మధ్యాహ్నం 12.25 గంటలకు బెంగళూరు విమానాశ్రాయానికి చేరుకుంటారు.
- 12.45: బెంగళూరు విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో నేమకల్లు హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 12.45 గంటల నుంచి 12.50 గంటల వరకూ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు.
- 12.50 గంటల నుంచి 1.20 గంటల వరకూ విశ్రాంతి తీసుకుంటారు.
- 1.20 గంటలకు హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 1.25 గంటలకు నేమకల్లు ఇందిరమ్మ కాలనీకి చేరుకుంటారు.
- 1.25 గంటల నుంచి 1.55 గంటల వరకూ ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు.
- 1.55 గంటల నుంచి 2.00 గంటల వరకూ నేమకల్లులోని ఆంజనేయస్వామిని దర్శించుకుంటారు. ఆ తరువాత 3.05 గంటల వరకూ స్థానిక ప్రజలతో సమావేశమవుతారు.
- మధ్యాహ్నం 3.10 గంటలకు నేమకల్లు హెలిప్యాడ్‌కు చేరుకొని 3.15 గంటల వరకూ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు.
- 3.45 గంటలకు హెలిక్యాప్టర్‌లో బెంగళూరుకు బయలుదేరుతారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు


నేమకల్లు గ్రామంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ

బొమ్మనహాళ్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటనకు ముమ్మరంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. సామాజిక భద్రత పింఛన్లను పంపిణీ చేసేందుకు ఈ నెల 30న ముఖ్యమంత్రి బొమ్మనహాళ్ మండలం నేమకల్లు గ్రామానికి వస్తున్నారు. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, వివిధ శాఖల అధికారులు గ్రామంలో పర్యటించి ఏర్పాట్లు పరిశీలించారు.

అక్రమార్కులను అరెస్టు చేయాలి

సీఎంకు సీపీఐ జగదీష్ బహిరంగ లేఖ

అనంతపురం విద్య, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్ ముడుపుల బాగోతంపై కేసులు నమోదు చేసి, అక్రమార్కులను వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు గురువారం బహిరంగ లేఖ రాశారు. అదానీ కంపెనీతో జగన్ ప్రభుత్వం విద్యుత్ యూనిట్ ధర రూ.1.99కు కొనుగోలు చేసి, రూ.2.49 చెల్లించారని అన్నారు. ఈ వ్యవహారంలో రూ.1750 కోట్లు ముడుపుల రూపంలో అందాయని అమెరికా దర్యాప్తు సంస్థలు స్పష్టం చేశాయని అన్నారు. అమెరికాలో కేసులు కూడా నమోదయ్యాయని అన్నారు. ఈ అవినీతి ఒప్పందాల వల్ల రాష్ట్ర ప్రజలపై రూ.42 వేల కోట్ల భారం పడిందని మండిపడ్డారు. ముడుపుల బాగోతంపై కేసులు పెట్టింటి ప్రతిపక్షాలు, ప్రత్యర్థులు కాదని, ఏకంగా అమెరికా దర్యాప్తు సంస్థలే కేసులు పెట్టాయని గుర్తుచేశారు. ఈ అక్రమాలపై రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మౌనం వహించడం సరికాదని అన్నారు. జగన్ ప్రతిపక్ష నాయకుడని, ఇటీవలి ఎన్నికల్లో 40 శాతం ఓట్లు వచ్చాయని కేసులు పెట్టేందుకు, అరెస్టు చేసేందుకు కూటమి ప్రభుత్వం జంకుతోందా అని ప్రశ్నించారు. విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంపై విచారణ చేసి, చర్యలు తీసుకోకపోతే ఈ ప్రభుత్వం చెడ్డపేరు మూటగట్టుకోక తప్పదని హెచ్చరించారు.

కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు

పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్


మాట్లాడుతున్న పెద్దనగౌడ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నందుకు పెన్షనర్ల తరఫున కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామని ఏపీ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్ అన్నారు. సంఘం కార్యాలయంలో జిల్లాలోని పెన్షనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో 2000, 10, 11, 12, 13 సంవత్సరాల్లో రిటైర్ అయిన ఉద్యోగులకు కమిటేషన్, రికవరీ నిలుపుదల చేసి ఖాతాలలో సొమ్ము జమ చేయడం ఆనందంగా ఉందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను 10 శాతం నుంచి 7 శాతానికి, 15 శాతం నుంచి 12 శాతానికి కుదించి పెన్షనర్లను ఇబ్బందులకు గురిచేసిందని అన్నారు. కూటమి ప్రభుత్వం తగ్గించిన క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను పెంచి న్యాయం చేయాలని కోరారు. డీఆర్, డీఆర్ అరియర్స్‌ను వెంటనే ప్రకటించాలని, అవసానదశలో ఉన్న పెన్షనర్లకు ఊరట కలిగించాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి శీలా జయరామప్ప, కోశాధికారి రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయండి

వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు మాటలకే పరిమితమయ్యారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వానికి ఆరు నెలల హనీమూన్ పిరియడ్ ముగిసిందని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని అన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలన్నీ దెబ్బతిన్నాయని, దిగుబడులు రాని పరిస్థితి నెలకొందని అన్నారు. ఉమ్మడి జిల్లాలో 63 మండలాలుంటే ఈ ఏడాది 17 మండలాలనే కరువు జాబితాలో చేర్చడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. రైతు భరోసా పథకం పేరును అన్నదాతా సుఖీభవగా మార్చుకున్నారని, కానీ వాళ్లు అధికారంలోకి వచ్చి సుఖంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఇంకా ఇవ్వలేదని అన్నారు. వరి, వేరుశనగను కల్లాల్లో వేసుకుని రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని అన్నారు. 37 లక్షల మెట్రిక్ టన్ను వరి ధాన్యం సేకరిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారని, ఇప్పటివరకు 4.50 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించారని అన్నారు. రాష్ట్రంలో ఆయిల్ ఫెడ్ అనేది ఉందా అని ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధులు జగన్‌ను విమర్శించడమే తప్ప సమస్యలను పట్టించుకోవడం లేదని అన్నారు. అధికార యంత్రాంగం నిద్రమత్తులో ఉందని విమర్శించారు. ఇసుక, మట్టి, మద్యం, బూడిద అమ్మకాలపైనే ఎమ్మెల్యేల దృష్టి ఉందని విమర్శించారు.

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ అని వక్తలు పేర్కొన్నారు. స్థానిక అనంత క్రీడాగ్రామంలోని జూడో ఇండోర్ స్టేడియంలో గురువారం హరీష్‌కుమార్ యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎన్‌సీసీ క్యాడెట్లకు ఎస్‌ఎల్‌ఆర్ డ్రిల్ రైఫిల్స్ అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు.. సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్‌సీసీ క్యాడెట్లు అంటే భావి సైనికులు అని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి, హరీష్‌కుమార్ యాదవ్, జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాటి భరత్ తదితరులు పాల్గొన్నారు.

అహుడాలో అలజడి

రెండు కంప్యూటర్లు ఫార్మాట్

అవినీతి సమాచారం డిలీట్..?

ఏఓ దీర్ఘకాలిక సెలవు



అనంతపురం క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అనంతపురం-హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో అంతా గుట్టుగానే జరిగిపోతుంటుంది. ఏదున్నా.. అధికారులు, రియల్టర్లు, ఎల్‌టీపీల మధ్యనే ఉంటుంది. ప్రజలతో పెద్దగా సంబంధాలు ఉండవు. దీంతో ఎవరూ అహుడా కార్యాలయంలోకి అడుగు పెట్టరు. లే అవుట్ల అప్రూవల్స్ కోసం ఎంత వసూలు చేశారు..? పనులకు ఎంత బిల్లులు పెట్టుకుంటున్నారో అర్థం కాని పరిస్థితి. అహుడాలో గత కొన్నేళ్లుగా భారీ గోల్‌మాల్ జరుగుతోందని ప్రచారం ఉంది. భారీ మొత్తంలో నిధులు మళ్లించినట్లు తెలుస్తోంది. దొంగ బిల్లులతో కొందరు జేబులు నింపుకున్నట్లు సమాచారం. అహుడా వైస్ చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్ బాధ్యతలు చేపట్టాక అక్రమాలు బయటపడుతున్నట్లు తెలిసింది. బిల్లుల గురించి ఆయన ఆరా తీసినట్లు సమాచారం. అహుడా చైర్మన్ టీసీ వరుణ్‌కు కొంతకాలం పరీక్ష తప్పదని అంటున్నారు.

ఏఓ సెలవు

అహుడాలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ) అకౌంట్స్ విభాగం చూస్తారు. ఏఓ లక్ష్మీదేవి దీర్ఘకాలిక సెలవులోకి వెళ్లడం ఆ శాఖలో ప్రకంపనలు రేపుతోంది. ఎవరైనా అధికారి కొన్ని రోజులపాటు సెలవు పెడితే.. ఇన్‌చార్జ్ బాధ్యతలు కిందిస్థాయి వారికి అప్పగిస్తారు. కానీ ఏఓ తొలుత వారం రోజులు సెలవు పెట్టారు. తరువాత ఏకంగా 50 రోజులు పొడిగించుకున్నారు. కానీ ఎవరికీ చార్జ్ ఇవ్వలేదు. ఆమె వినియోగిస్తున్న కంప్యూటర్‌ను ఆన్ చేయడానికి ప్రయత్నిస్తే.. పాస్‌వర్డ్ అడుగుతోంది. ఫోన్ చేసి తెలుసుకుని ఆన్ చేస్తే.. అందులో ఏమీ కనిపించలేదు. దీంతో అధికారులు అవాక్కయ్యారు. మొత్తం ఫార్మాట్ చేసినట్లు తెలిసింది. ఎందుకిలా చేశారో తెలుసుకునేందుకు అధికారులు ఫోన్ చేస్తే.. ఏఓ స్పందించలేదని సమాచారం. కొన్ని బిల్లులపై జేసీ ఆరా తీయడంతో ఆమె సెలవు పెట్టారని ఆ శాఖలో ప్రచారం జరుగుతోంది.

ఎవరెవరున్నారో...?

అహుడాలో ఉన్నతాధికారి వైస్ చైర్మన్. ఆ పోస్టులో ఇదివరకు మురళీకృష్ణ గౌడ్ ఉండేవారు. ఆయన ఉపయోగించే సిస్టమ్ కూడా ఫార్మాట్ అయినట్లు సమాచారం. ఫార్మాట్ చేసిందెవరు అనేది చర్చనీయాంశంగా మారింది. వైసీపీ హయాంలో భారీగా అవినీతి జరిగిందని సమాచారం. వైసీపీ హయాంలో అహుడా చైర్మన్‌గా మహాలక్ష్మి శ్రీనివాస్ కొనసాగారు. అప్పట్లో అనధికార లేఅవుట్లకు అప్రూవల్స్ లేకుండానే రిజిస్ట్రేషన్లు చేయించారు. కొన్ని లే అవుట్ల విషయంలో అధికారులు, నేతలతో రియల్టర్లు ముడుపుల వ్యవహారం నడిపినట్లు ఆరోపణలు ఉన్నాయి.


సమన్వయ కమిటీ సమావేశానికి హాజరైన జిల్లా ఇన్‌చార్జి మంత్రి టీజీ భరత్, మంత్రి పయ్యావుల కేశవ్

కష్టపడిన వారికి ప్రాధాన్యం

సాధ్యమైనన్ని పదవులు వస్తాయి
పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో మంత్రులు టీజీ భరత్, కేశవ్

అనంతపురం అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ అధినాయకత్వం గుర్తింపునిస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి టీజీ భరత్ అన్నారు. కమ్మ భవన్‌లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ అధ్యక్షతన గురువారం పార్టీ సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కియ సమీపంలో మరో పెద్ద పరిశ్రమ రాబోతోందని అన్నారు. కరువు జిల్లాలో పరిశ్రమలు స్థాపించి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అన్నారు. గతంలో మాదిరిగా ఎమ్మెల్యేలు, ఎంపీలు లెటర్లు ఇస్తే పదవులు ఇచ్చే పరిస్థితి లేదని, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. జిల్లా నాయకులకు నిత్యం అందుబాటులో ఉంటానని అన్నారు. జిల్లా అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వ నమోదును నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని ఎమ్మెల్యేలు, నాయకులకు సూచించారు.

సమష్టిగా పనిచేయాలి: కేశవ్

ప్రజలకు మరింత చేరువయ్యేందుకు సమష్టిగా పనిచేయాలని పార్టీ నాయకులకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సూచించారు. కొత్త వారితో సభ్యత్వం చేయించాలని, గతంలో సభ్యత్వం తీసుకున్న వారికి రెన్యువల్ చేయాలని సూచించారు. అవకాశం ఉన్న ప్రతి ఒక్కరికీ పదవులు ఇవ్వాలని పార్టీ అధినాయకత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. స్థలాన్ని సేకరించి.. త్వరలో పార్టీ జిల్లా కార్యాలయ భవనాన్ని నిర్మించాలని నిర్ణయించారు. రైతు సమస్యలు, సాగునీటి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాల గురించి చర్చించారు.

వైసీపీ నాయకుల మాటే చెల్లుతోంది: రామలింగారెడ్డి

టీడీపీ అధికారంలోకి వచ్చినా ప్రభుత్వ కార్యాలయాల్లో వైసీపీ నాయకుల మాటే చెల్లుతోందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి ఇన్‌చార్జి మంత్రితో అన్నారు. బుక్కరాయసముద్రం సీఐ వైసీపీ నాయకులకే పనిచేస్తున్నారని అన్నారు. అధినాయకత్వం దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని అన్నారు. మండలంలో నగం ఎఫ్‌పీ షాపు డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాలు చేపట్టలేదని, కార్యకర్తలు బాధపడుతున్నారని అన్నారు. త్వరగా నియమకాలు పూర్తి చేసి కార్యకర్తలకు న్యాయం చేయాలని కోరారు.

పనిచేసిన వారిని గుర్తించాలి: ఆలం

వైసీపీ అరాచక పాలనలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు ఇన్‌చార్జి మంత్రిని కోరారు. శింగనమల నియోజకవర్గంలో రెవెన్యూ అధికారులు ఇప్పటికీ వైసీపీ మూడ్‌లోనే ఉన్నారని, అలాంటి అధికారులపై తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు. గార్లదిన్నె వద్ద జరిగిన ప్రమాదంలో మృతిచెందిన కూలీల కుటుంబాలకు మరుసటి రోజే పరిహారం అందించారని అన్నారు. క్షతగాత్రులకు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందించారని, ఇందుకు సీఎం చంద్రబాబు, మంత్రి పయ్యావుల కేశవ్, ఇతర ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ హయాంలో ఘోర రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందినవారి కుటుంబాలకు ఇప్పటికీ ఆదుకోలేదని అన్నారు. సమావేశంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, బండారు శ్రావణి శ్రీ, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, రాష్ట్ర నాయకులు ఉన్నం హనుమంతరాయ చౌదరి, తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, గాజుల ఆదెన్న, సాకే గంపన్న, కేఎం జకీవుల్లా, రాయల్ మురళి, దేవళ్ల మురళి, ముంటిమడుగు కేశవరెడ్డి, నటేష్ చౌదరి, ఉన్నం మారుతీ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.33



అనంతపురం రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.33తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు గురువారం 900 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 26, కనిష్ఠ ధర రూ.20 పలికినట్లు ఆయన తెలిపారు.

అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్

● సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ ● జిల్లాకు పరిశ్రమలు తీసుకొస్తాం ● డీఆర్సీ సమావేశంలో మంత్రులు టీజీ భరత్, కేశవ్


సమావేశంలో ఎస్పీ, కలెక్టర్, మంత్రులు టీజీ భరత్, కేశవ్, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ప్రభుత్వ విప్ కాలవ

అనంతపురం టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధతో విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి టీజీ భరత్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో జిల్లా సమగ్రాభివృద్ధిపై గురువారం డీఆర్సీ సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యవసాయం, నీటి పారుదల, ఉపాధి పథకం, వైద్యం గురించి చర్చ జరిగింది. జిల్లా అభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని టీజీ భరత్ సూచించారు. ప్రజాప్రతినిధులు ఎలాంటి సమస్యలపై వినతులు ఇచ్చినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఐటీ మంత్రి నారా లోకేష్‌తో కలిసి జిల్లాకు పలు పరిశ్రమలు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. అధికారులపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నీరే ప్రధానం: కేశవ్

● జిల్లా అభివృద్ధికి కీలకమైన సాగు, తాగునీటికి, పరిశ్రమల స్థాపనకు ప్రాధాన్యం ఇస్తామని ఆర్థిక మంత్రి కేశవ్ అన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు దారుణంగా ఉన్నా.. వాటిని అధిగమిస్తూ అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నామని అన్నారు. ఉద్యోగుల పీఎఫ్ సొమ్మే వైసీపీ ప్రభుత్వం రూ.21 వేల కోట్లు వాడుకుందని అన్నారు. ఇలాంటి సమస్యలను దాటుకుని సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నామని, అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. తమవంతు సహకారం అందిస్తామని అన్నారు.

● కార్యాలయంలో కూర్చోకుండా ఫీల్డ్‌కు వెళ్లాలని జలవనరుల శాఖ ఎస్ఈకి కేశవ్ సూచించారు. హెచ్చెల్సీ హంద్రీనీవా గురించి అధికారులు వివరిస్తుండగా సుబ్బరాయసాగర్‌కు నీళ్లు వచ్చాయా అని కేశవ్ ప్రశ్నించారు. వచ్చాయని ఎస్ఈ అనడంతో ఎంత వచ్చిందని ప్రశ్నించారు. దీంతో నీరు రాలేదని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి అన్నారు. రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. దీంతో ఫీల్డ్‌కు వెళితే విషయాలు తెలుస్తాయని కేశవ్ సుతిమెత్తగా హెచ్చరించారు. ఏదైనా పక్కా సమాచారమే చెప్పాలని, కాకిలెక్కలు వద్దని అన్నారు.

● డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి తమ శాఖ వివరాలను తెలిపారు. జనవరి నుంచి ఇప్పటి వరకు 121 డెంగీ కేసులు, 9 మలేరియా, ఒక చికున్ గున్యా కేసు వచ్చిందని వివరించారు. దీంతో కేశవ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. చికున్ గున్యా కేసు ఒక్కటేనా..? లెక్కలు కరెక్టేనా..? ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి చూడండి.. వాస్తవం తెలుస్తుంది అని అన్నారు.


సమావేశంలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఎమ్మెల్యేలు అమిలినేని, దగ్గుపాటి, బండారు శ్రావణి, అధికారులు

వరి ధాన్యం కొనండి: కాలవ

తన నియోజకవర్గంలోని కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాలలో వరి అధికంగా సాగు చేస్తుంటారని, మార్కెట్‌కు తీసుకుపోతుంటే తక్కువ ధర వస్తోందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. ప్రభుత్వం ద్వారా గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని కోరారు.

డబ్బు ఇవ్వండి: అమిలినేని

భైరవాన్ తిప్ప ప్రాజెక్టుకు రైతుల నుంచి భూములను సేకరించారని, వారికి రూ.120 కోట్లకు పైగా పరిహారం చెల్లించాల్సి ఉందని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. ఆ నిధులు మంజూరు చేసి రైతులకు ఇవ్వాలని కోరారు. కళ్యాణదుర్గం ఆస్పత్రిలో బెడ్లు, బీపీ మిషన్లు లేవని, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతులను ఆదుకోండి: శ్రావణి

అధిక వర్షాల కారణంగా గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, నార్పల మండలాలలో రైతులు పంటలు నష్టపోయారని, పరిహారం అందించి ఆదుకోవాలని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కోరారు. సుబ్బరాయసాగర్‌కు వెంటనే నీటిని విడుదల చేయాలని కోరారు.

ఆస్పత్రికి నిధులు ఇవ్వండి: దగ్గుపాటి

అనంతపురం సర్వజన ఆస్పత్రికి రోజుకు రెండు వేల మంది రోగులు వస్తుంటారని, 13వందల మంది ఇన్ పేషెంట్లు ఉంటున్నారని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. కానీ ఆస్పత్రిలో 560 పడకలే ఉన్నాయని, ప్రభుత్వం నుంచి నిధులు ఆ మేరకే వస్తున్నాయని తెలిపారు. రోగులు ఇబ్బంది పడుతున్నారని, నిధులను పెంచాలని కోరారు. చిన్నపాటి వర్షానికే ఇళ్లలోకి నీరు చేరుతోందని, రక్షణ గోడల నిర్మాణానికి నిధులు ఇవ్వాలని కోరారు.

చర్యలు తప్పవు: కలెక్టర్

ప్రభుత్వ పథకాల అమలు విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ హెచ్చరించారు. ప్రతి జిల్లా అధికారి తమ శాఖలను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రగతి చూపాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో కూడా అధికారులు, సిబ్బంది పనిచేయాలని మంత్రులు సూచించారు.

బాల్య వివాహం.. ఆరుగురిపై కేసు


బాల్య వివాహంపై ఆరాతీస్తున్న ఐసీడీఎస్ అధికారులు, పోలీసులు

యాడికి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): చెల్లెలి కాపురం చక్కదిద్దాలని భావించిన సోదరుడు.. చేసింది బాల్యవివాహం అని మరిచి కోర్టు మెట్లు ఎక్కాడు. విచారణ సమయంలో విషయం బయట పడటంతో కోర్టు తీవ్రంగా పరిగణించింది. దీంతో రెండు కుటుంబాలవారిపై కేసు నమోదైంది. 2022లో బాల్య వివాహం జరిగిందని, ఐసీడీఎస్ అధికారుల ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేశామని సీఐ ఈరన్న గురువారం తెలిపారు. యాడికి పట్టణానికి చెందిన జయసింహకు, ఓ గ్రామానికి చెందిన బాలిక(14)తో వివాహం జరిగింది. తొమ్మిది నెలల తరువాత విభేదాలు రావడంతో ఇద్దరూ విడిపోయారు. వీరి కాపురాన్ని చక్కదిద్దాలని బాలిక సోదరుడు గుత్తి కోర్టును ఆశ్రయించాడు. బాల్య వివాహం విషయం బయటపడటంతో కోర్టు తీవ్రంగా పరిగణించింది. కోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 23న ఐసీడీఎస్ అధికారులు విచారణకు హాజరయ్యారు. బాల్య వివాహంపై చర్యలు తీసుకుని, డిసెంబరు 7లోగా నివేదించాలని ఆదేశించింది. దీంతో ఐసీడీఎస్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారించారు. వివాహ సమయానికి బాలికకు 14 సంవత్సరాల 4 నెలల వయసు ఉన్నట్లు నిర్ధారణ అయింది. దీంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికను వివాహం చేసుకున్న జయసింహతోపాటు అతని తల్లిదండ్రులు లక్ష్మీదేవి, శ్రీరాములు, బాలిక తల్లిదండ్రులు రామలక్ష్మమ్మ, వీరనారాయణ, సోదరుడు రామకృష్ణపై కేసు నమోదైంది.

పాముకాటుతో రైతు మృతి


నాగేంద్ర (ఫైల్)

పెనుకొండ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటగిరి పాళ్యం గ్రామానికి చెందిన మూగ పాడి రైతు బోయ నాగేంద్ర (29) పాముకాటుతో మృతిచెందాడు. బోయ ఈశ్వరప్ప, పాపమ్మ దంపతుల కుమారుడు నాగేంద్రకు పుట్టుకతోనే మాటలు రావు. పాడిఆవులు పెంచుకుని జీవనం సాగించేవారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం పశువుల మేత కోసం గడ్డి కోసుకొచ్చేందుకు నాగేంద్ర పొలాని కెళ్లాడు. అక్కడ పాము కాటేసింది. ఇంటికి చేరుకున్న నాగేంద్ర మూగ కావడంతో పాము కాటేసిన విషయం చెప్పలేకపోయాడు. కాసేపటికి అపస్మారక స్థితిలో చేరుకోవడంతో కుటుంబీకులు వెంటనే గుట్టూరు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్తుండగా.. మార్గమధ్యలో బుధవారం అర్ధరాత్రి మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. రైతు మృతిపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపట్టినట్లు కియ పోలీసులు తెలిపారు.

ఫార్మసీతో ఉద్యోగాలు మెండు

నేటి నుంచి ప్రవేశాలకు కౌన్సెలింగ్

అనంతపురం సెంట్రల్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): ఫార్మసీ కోర్సు పూర్తిచేస్తే ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. దీంతో ఫార్మసీ కోర్సులకు డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో కళాశాలల్లో చేరడానికి శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడత వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభిస్తోంది. ఏపీ ఈఏపీసెట్-2024లో అర్హత సాధించినవారు అడ్మిషన్‌కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. డిసెంబరు 6వరకు రిజిస్ట్రేషన్, పేమెంట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. తరువాత సర్టిఫికెట్స్‌ను ఆన్‌లైన్ ద్వారానే కౌన్సెలింగ్ సెంటర్‌లో వెరిఫై చేస్తారు. వచ్చేనెల 3 నుంచి 7వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలి. మార్పులు చేసుకోవడానికి 8న అవకాశం కల్పించారు. కౌన్సెలింగ్ పూర్తిచేసుకున్న వారికి 11న సీట్లను కేటాయిస్తారు. ఆదేరోజు నుంచి 14 వరకు కళాశాలల్లో సెల్ఫ్ రిపోర్టు చేసుకోవాలి. విద్యార్థుల సహాయార్థం అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

32 కళాశాలలు.. 1481 సీట్లు

ఈఏపీసెట్ ప్రథమ కౌన్సెలింగ్ ద్వారా జేఎన్‌టీయూ పరిధిలోని ఉమ్మడి అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు, నెల్లూరు జిల్లాలో 31 ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. కన్వీనర్ కోటాకింద మొత్తం 1448 సీట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఎస్కేయూ ఫార్మసీ కళాశాలలో 33 సీట్లున్నాయి. మొత్తం 32 కళాశాలల్లో 1481 సీట్లు ఉన్నాయి. వీటిలో బి-ఫార్మసీ 1197, ఫార్మా-డి 251, ఫుడ్ టెక్నాలజీకి 33 సీట్లను కేటాయించారు. జేఎన్‌టీయూ కలికిరి ఇంజనీరింగ్ కళాశాలలో మాత్రమే ఫుడ్ టెక్నాలజీ కోర్సు ఉంది. దీనికి ఈఏపీసెట్‌లో అర్హత సాధించిన ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు కౌన్సెలింగ్‌కు అర్హులు.

మృత్యువులోనూ కలిసే..

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బైక్.. ఇద్దరు స్నేహితుల దుర్మరణం


దాదు, పవన్‌కుమార్ (ఫైల్)

హిందూపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఇద్దరూ స్నేహితులు. కలిసి మెలిసి ఉండేవారు. మృత్యుఒడికి కూడా కలిసే వెళ్లారు. మండలంలోని తూముకుంట సమీపాన మలుపు వద్ద గురువారం సాయంత్రం ట్రాక్టర్‌ను బైక్ ఢీకొన్న ప్రమాదంలో దాదు(38), పవన్‌కుమార్ (25) దుర్మరణం చెందారు. స్థానిక త్యాగరాజనగర్ పరిధి గాజుల వీధిలో వీరు నివాసముండేవారు. స్నేహితులు కూడా. దాదు కార్పెంటర్ పనికెళ్తుండేవాడు. శివశంకర్, లక్ష్మీనరసమ్మ దంపతుల కుమారుడైన పవన్‌కుమార్ పట్టణంలోని ఓ ల్యాబ్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తుండేవాడు. మధ్యాహ్నం ఇద్దరూ బైక్‌పై గౌరీబిదునూరు వైపు వెళ్లారు. పని ముగించుకుని హిందూపురానికి బయల్దేరారు. తూముకుంట చెక్‌పోస్టు వైపు నుంచి తూముకుంటలోకి వెళ్లేందుకు ట్రాక్టర్ కుడివైపు తిరుగుతుండగా ఎదురుగా వచ్చి ఢీకొట్టారు. ట్రాక్టర్ ట్రాలీ కిందకు బైక్ దూసుకెళ్లింది. దాదు, పవన్‌కుమార్ తలలకు బలమైన గాయాలై, అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న సీఐ ఆంజనేయులు ప్రమాదస్థలాన్ని పరిశీలించి, మృతదేహాలను హిందూపురం ఆస్పత్రికి తరలించారు. దాదుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.


ప్రమాద స్థలంలో దాదు, పవన్‌కుమార్ మృతదేహాలు

గంజాయి జోలికెళ్తే మటాషే..!



కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం

- సరఫరాదారులపై పోలీసుల డేగకన్ను
- కేసులతోపాటు ఆస్తుల జప్తుకు సన్నాహాలు
- ఆధార్, రేషన్‌కార్డు స్వాధీనానికి సిద్ధం
- 1 నుంచి మహాసంకల్పం పేరుతో అవగాహన సదస్సులు


చిలమత్తూరులో పట్టుబడిన గంజాయి (ఫైల్)

హిందూపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గంజాయి జోలికెళ్తే మటాషే. కూటమి ప్రభుత్వం.. గంజాయిపై ఉక్కుపాదం మోపుతోంది. కఠిన చర్యలకు ఉపక్రమిస్తోంది. గంజాయి కేసుల్లో పట్టుబడితే ఆస్తులను సైతం జప్తు చేయనుంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎక్కడ చూసినా గంజాయి విచ్చలవిడిగా దొరికింది. యువతతోపాటు విద్యార్థులు, మహిళలు సైతం గంజాయికి బానిసలయ్యారు. ఆ మత్తులో ఎన్నో దుర్మార్గాలకు పాల్పడ్డారు. ఇటీవల హిందూపురంలో పోలీసులకు పట్టుబడిన నేరస్తులు అధిక శాతం గంజాయి సేవించినట్లు రుజువైంది. వీరిలో యువతతోపాటు విద్యార్థులు కూడా ఉండటం కలవర పరుస్తోంది. హిందూపురం ప్రాంతంలో ఇటీవల జరిగిన చాలా నేరాలు గంజాయితో ముడిపడి ఉన్నాయి. దీనినిబట్టి గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గంజాయి, మత్తు పదార్థాలు ఏస్థాయిలో క్షేత్రస్థాయికి విస్తరించాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇటీవల కొంతమంది తల్లిదండ్రులు పోలీసుల వద్దకు వెళ్లి తమ పిల్లలు గంజాయికి బానిసలుగా మారారనీ, ఎలాగైనా వారిని మాన్పించాలని వేడుకుంటుండడం ఆందోళన రేపుతోంది. ఇలాంటి వాటికి పాల్పడుతున్న వారిని, అందుకు కారకులైన వ్యక్తులను ఆరు నెలల్లో పూర్తిస్థాయిలో కట్టడి చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం బుధవారం నిర్ణయం తీసుకుంది.

ఆస్తుల జప్తుకు సన్నాహాలు

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గంజాయిపై పోలీసు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అయినా కొన్నిచోట్ల గతంలో ఉన్న కొంతమంది అధికారుల పరిచయాలతో అప్పటి నాయకులు గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మంత్రివర్గ ఉపసంఘం గంజాయిపై ఉక్కుపాదం మోపేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ మహమ్మారిని అంతమొందించేందుకు పలు చర్యలు తీసుకుంటోంది. గంజాయి డ్రగ్స్ ఆనవాళ్లు లేకుండా చేయడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. త్వరలో ఈగల్ 1972 టోల్‌ఫ్రీ నంబరును ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ సందర్భంలో ప్రభుత్వం గంజాయి నిర్వాహకులపై మరింత కఠినంగా వ్యవహరించనుంది. అప్పటికీ మారని గంజాయి క్రయవిక్రయదారులపై మరింత కఠినంగా వ్యవహరిస్తూ వారి ఆస్తుల జప్తుకు కూడా సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా గంజాయి, డ్రగ్స్‌ను రూపుమాపడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తున్నట్లు స్పష్టమవుతోంది.

ఆధార్, రేషన్‌కార్డు స్వాధీనం

గంజాయి నేరస్తులపై కఠినంగా వ్యవహరించే దిశగా ప్రభుత్వం ముందుకెళ్తోంది. గంజాయి నేరస్తులపై కేసులు నమోదుచేయడంతోపాటు వారి ఆస్తులను సైతం జప్తు చేయనున్నారు. వారికి ఆస్తులు లేకపోతే ఆధార్, రేషన్‌కార్డులు స్వాధీనం చేసుకుంటామని ఇటీవల హోంశాఖ మంత్రి అనిత వెల్లడించారు. దీంతో గంజాయి నేరస్తుల్లో అలజడి రేగుతోంది.

పురంలో 32మంది అరెస్టు

పురంలో గంజాయిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. గత ఐదేళ్లలో విచ్చలవిడిగా గంజాయిని చిల్లరకొట్లులో పెట్టి అమ్మినా పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించారు. ఈ వ్యాపారంలో కొంతమంది వైసీపీ వారు ఉండటంతో పోలీసులు వెనక్కు తగ్గారన్నది బహిరంగ రహస్యమే. కూటమి ప్రభుత్వం వచ్చాక వైసీపీకి వీరవిధేయులుగా ఉన్న పోలీసు అధికారులను బదిలీచేసి కొత్తవారిని తీసుకొచ్చారు. దీంతో రెండు నెలల వ్యవధిలో గంజాయి కేసుల్లో 32 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి పెద్దఎత్తున గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

1 నుంచి మహాసంకల్పం

గంజాయి, డ్రగ్స్‌కు బానిసలైనవారు ఎలాంటి నేరాలకు పాల్పడతారు, వారి నుంచి సమాజానికి ఎలా చేటు వాటిల్లుతుందో తెలియజేసేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో డిసెంబరు ఒకటో తేదీ నుంచి మహాసంకల్పం పేరుతో పెద్దఎత్తున అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. ఇందుకు జిల్లా, మండలం, గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. అందుకు డ్రోన్లను విరివిగా వినియోగించుకోనున్నారు. రానున్న ఆరు నెలల్లో గంజాయి, డ్రగ్స్‌ను నిర్మూలించే దిశగా ప్రభుత్వం ముమ్మర చర్యలు తీసుకుంటోంది.

సరఫరాదారులపై డేగకన్ను

గంజాయి మహమ్మారి సమాజాన్ని ముఖ్యంగా యువత జీవితాలను సర్వనాశనం చేస్తుండటమేకాక కొంతమందిని జీవచ్ఛవాలుగా, నేరస్తులుగా మారుస్తోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వీటిపై గట్టి చర్యలు తీసుకునేందుకు ముందుకెళ్తోంది. ఇందులో భాగంగానే బుధవారం మంత్రివర్గం ఉపసంఘం గంజాయి క్రయవిక్రయాలు జరిపేవారిపై ఉక్కుపాదం మోపుతామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్ అధికారంలోకి వచ్చిన వెంటనే గంజాయి, మాదకద్రవ్యాలను రూపుమాపుతామని హామీ ఇచ్చారు. ఆ మేరకే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో గంజాయి సరఫరాదారులపై పోలీసులు డేగకన్ను వేశారు. ఇందుకోసం ఈగల్ పేరుతో యాంటీ నార్కొటిక్స్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. నార్కొటిక్స్ పోలీస్ స్టేషన్లు కూడా ఏర్పాటుకానున్నాయి. ఇప్పటికే పోలీసు అధికారులు గంజాయి క్రయవిక్రయాలు జరిపేవారిని గుర్తించి, డ్రోన్ల ద్వారా నిఘా వేస్తున్నారు.

గంజాయిని అరికడతాం..



హిందూపురంలో గంజాయికి సంబంధించి అనుమానం ఉన్న 32 మందిని అరెస్టు చేశాం. గంజాయి, డ్రగ్స్ విషయంలో చాలా కఠినంగా వ్యవహరిస్తాం. ఇందుకోసం ప్రత్యేక బృందాల ద్వారా నిఘా పెట్టాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. గంజాయి నేరస్తులకు సంక్షేమ పథకాలు నిలిపివేయడంపై ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇందుకోసం ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులు కూడా విడుదల చేసింది.

\- మహేష్, డీఎస్పీ, హిందూపురం

అయ్యో.. పాపం..!

పెద్దదిక్కును కోల్పోయిన ఇంట్లో చోరీ..
నగదు.. బంగారం అపహరణ


చోరీ చేసిన ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు

భర్తను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉంది. ఆమె ఎలా బతుకుతుందోనని బంధువులు ఆవేదన చెందారు. ఖర్చులకు డబ్బులిచ్చారు. వాటన్నింటినీ అలాగే బీరువాలో పెట్టింది. బిడ్డను తీసుకుని, ఆచారం ప్రకారం ఆలయం వద్దకు నిద్రించేందుకు వెళ్లింది. తిరిగి వచ్చి చూసేసరికి ఇల్లు గుల్లయింది.

నార్పల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఇంటి పెద్దదిక్కును కోల్పోయి 15 రోజులు గడవకనే ఆ ఇంట్లో దొంగలు పడ్డారు. మండలకేంద్రంలోని దూల్‌పేట కాలనీకి చెందిన చాకలి సుధాకర్ (47) గుండెపోటుతో 15 రోజులు క్రితం మృతిచెందాడు. సంప్రదాయ ప్రకారం అతడి భార్య నాగేశ్వరి గూగూడు దేవాలయంలో నిద్ర చేయడానికి బుధవారం రాత్రి ఇంటికి తాళాలు వేసి, కొడుకు సహా వెళ్లింది. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తలుపులు తెరచి, లోపలికి చొరబడ్డారు. బీరువాను రాడ్లతో ధ్వంసం చేసి, అందులోని రూ.1.10 లక్షల నగదు, రెండు తులాల బంగారు నగలు చోరీ చేశారు. గురువారం ఉదయం ఇంటికి తిరిగొచ్చిన నాగేశ్వరి చోరీ విషయాన్ని గ్రహించి గొల్లుమంది. ఎస్ఐ సాగర్ క్లూస్ టీమ్‌ని పిలిపించి, వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. భర్త చనిపోతే బంధువులు, పుట్టింటివారు ఖర్చులకు పనికొస్తాయనీ, పెట్టుకోమని ఆ డబ్బు ఇచ్చారనీ, వాటిని కూడా దొంగలు చోరీ చేసుకెళ్లారని పోలీసుల ఎదుట బాధితురాలు వాపోయింది.

పురుగుల మందు తాగేస్తున్నా..!

సెల్ఫీ వీడియో పెట్టి వ్యక్తి అదృశ్యం


సెల్ఫీ వీడియోలో మందు తాగుతున్న అనిల్, క్రిమిసంహారక మందు

బెళుగుప్ప, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): దుద్దేకుంట గ్రామానికి చెందిన అనిల్ భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సెల్ఫీ వీడియో పంపి అదృశ్యమయ్యాడు. విడపనకల్లు మండలం హావళిగి గ్రామానికి చెందిన గీత అనే మహిళను అనిల్ ఏడాది క్రితం వివాహం చేసుకున్నాడు. మొదటి నుంచి దంపతుల మధ్య సఖ్యత లేదని సమాచారం. దీంతో పెద్దలు ఇటీవల పంచాయితీ చేశారు. కలిసి ఉంటామని చెప్పి దుద్దేకుంటకు వచ్చారు. బుధవారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆత్మహత్య చేసుకుంటున్నానని బుధవారం క్రిమిసంహారక మందు సీసాతో సెల్ఫీ వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. అనిల్ తండ్రి ఎర్రిస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతని సెల్ ఫోన్ స్విచాఫ్ వస్తోందని, కేసు నమోదు చేశామని ఎస్ఐ శివ తెలిపారు. అనిల్ గాలిమరల వద్ద సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు.

సంక్షిప్తం

విద్యుత్ సమస్యలపై విచారణ

అనంతపురం రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రంపేటలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గురువారం పంచాయతీలో మీ ఇంటికి మీ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానికులు విద్యుత్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాలతో విద్యుత్ శాఖ టౌన్-2 డీఈఈ శ్రీనివాసులు శుక్రవారం క్షేత్రస్థాయిలో స్థానికులతో విచారించారు. విద్యుత్ లైన్లను, ఇళ్ల వద్ద విద్యుత్ మీటర్లను పరిశీలించారు. సమస్యలను గుర్తించి ఎమ్మెల్యేకి వివరించారు. రెండు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు వెంటనే చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే విద్యుత్ అధికారులకు సూచించారు. దీంతో స్థానికులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

సభ్యత్వ నమోదుకు రూ.లక్ష విరాళం



నగదు అందజేస్తున్న నారాయణస్వామి

అనంతపురం రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుగుంట పంచాయతీలోని నిరుపేదలైన టీడీపీ కార్యకర్తల సభ్యత్వ నమోదుకు తెలుగు రైతు రాప్తాడు నియోజక వర్గం అధ్యక్షుడు మారినేని నారాయణస్వామి రూ.లక్ష నగదు అందజేశారు. నగరంలోని ఎమ్మెల్యే పరిటాల సునీత క్యాంపు కార్యాలయంలో గురువారం టీడీపీ నాయకులు సుధాకర్ నాయుడు, మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పాముదాయి రఘుకు ఆ నగదును అందజేశారు.

చీనీ టన్ను రూ.29వేలు

అనంతపురం రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.29,190, కనిష్ఠంగా రూ.13 వేలు, సరాసరి రూ.18 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 39టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం

రాప్తాడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాండ్లపర్తి గ్రామంలో పాడి పశువులకు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం ఏర్పాటు చేసినట్లు పశు వైద్యాధికారులు ప్రకాష్, సోమేశ్వరి తెలిపారు. కృత్రిమ గర్భధారణ పథకం గురించి వివరించారు. డీఎల్‌డీఏ జిల్లా కార్యని ర్వాహణ అధికారి డాక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

అసౌకర్యంతో దారి మూసేశాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల దారి విషయమై 'విద్యార్థులకు దారి కష్టాలు' అనే శీర్షికతో గురువారం ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించిన విషయం విదితమే. ఇందుకు జిల్లా గురుకుల విద్యాలయాల అధికారి (డీసీఓ) ఉదయశ్రీ, కళాశాల ప్రిన్సిపాల్ స్పందించారు. అనంతపురం- బళ్లారి హైవే రోడ్డు నుంచి, స్థానికంగా ఉన్న ఎస్సీ కాలనీ లో నుంచి కళాశా లకు వచ్చివెళ్లేందుకు అసౌకర్యంగా ఉండటంతో గతంలో ఉన్న దారిని మూసివేసివేసినట్లు తెలిపారు. దారిలో మురుగు కాలువ ఉండటం, ఇతరత్ర సమస్యల కారణంగా కొన్నేళ్లుగా ఆ దారి గుండా రాకపోకలు చేయడం లేదన్నారు. ప్రస్తుతం వైఎస్సార్ కాలనీకి వెళ్లే దారి గుండా రాకపోకలు సాగిస్తున్నామన్నారు. అదేవిధంగా కళాశాల ప్రహరీ చుట్టూ ఉన్న ముళ్ల కంపలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సోషల్ మీడియాలో అనుచిత పోస్టులపై ఫిర్యాదు

అనంతపురం క్రైం/ అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎం2ఎం న్యూస్ సుధాకర్‌పై కేసు నమోదైంది. తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మీనరసింహ టీడీపీ నాయకులతో కలిసి గురువారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు వ్యతిరేకంగా, ఒక మతాన్ని కించపరిచే విధంగా ఎం2ఎం న్యూస్ ఎక్స్‌క్లూజివ్ పేరుతో సోషల్ మీడియాలో గురువారం న్యూస్ వచ్చిందని, ఆ న్యూస్ పెట్టిన వ్యక్తి సుధాకర్ అని తెలిసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో నాయకులు రమేష్, నారా యణస్వామి, నాగార్జున, రామలింగ ఎస్‌ఐకి ఫిర్యాదు చేశారు.

మహిళపై అనుమానం.. ఫిర్యాదు

అనంతపురం క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : రూరల్ మండలంలో ఓ మహిళను చిన్నపిల్లలను కిడ్నాప్ చేసే వ్యక్తిగా అనుమానించారు. ఆమెను పోలీ సులకు పట్టించారు. మండల పరిధిలోని చిన్నంపల్లిలోని ఎస్సీ కాలనీలోకి ఓ మహిళ వెళ్లింది. ఆమె చిన్నారులను ఎత్తుకెళ్లే మహి ళగా కాలనీవాసులు భావించారు. ఆమెను ప్రశ్నిస్తే పొంతనలేని సమాధానాలు చెప్పడంతో రూరల్ పోలీసులకు అప్పగించారు. పోలీస్‌స్టేషన్‌లో మానసిక స్థితి సరిగా లేనట్లు ప్రవర్తించడంతో పోలీసులు ఆమెను పంపేసినట్లు తెలిసింది.

వేగంగా షెడ్లు నిర్మించుకోవాలి

రాప్తాడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్లను వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని యర్రగుంట, బండమీదపల్లిల్లో గురువారం నిర్మాణంలో ఉన్న గోకులం షెడ్లను పరిశీలించారు. నాణ్యంగా నిర్మించాలన్నారు.

రోడ్లకు మోక్షమెప్పుడో..?

● అంతా గుంతలమయం
● ప్రయాణమంటే భయపడుతున్న గ్రామీణులు



గుంతలమయమైన కొట్టాలపల్లి రోడ్డు

గార్లదిన్నె, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాల్లో ఎక్కడ చూసినా గంతలమయమైన రహదారులే దర్శనమిచ్చాయి. వాటిపై ప్రయాణం చేయాలంటే వాహనదారులు నరకయాతన పడ్డారు. ఈ రోడ్లకు కూటమి ప్రభుత్వంలోనైనా మోక్షం కలుగుతుందా...? అని మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. మండల కేంద్రమైన గార్లదిన్నె నుంచి కోటంక గ్రామానికి వెళ్లే సుమారు 12 కిలో మీటర్ల రోడ్డు పూర్తిగా గుంతల మయమైంది. ఈ రోడ్డుపై ప్రయాణం సుమారు గంటకు పైగానే పడుతోంది. దీనికి తోడు దుమ్ముధూళి తో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఈ రోడ్డుపై కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వేలాది మంది భక్తులు వస్తుంటారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేయాల్సి వస్తోందని ప్రయాణికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా కమలాపురం క్రాస్ నుంచి కమలాపురం, కేకే తండా, కొట్టాలపల్లి, కొప్పలకొండ, కేశవాపురం గ్రామాల ప్రజలు నిత్యం వివిధ పనుల నిమిత్తం గార్లదిన్నె, అనంతపురానికి ఆటోల్లో, ద్విచక్ర వాహనాల్లో వెళ్తుంటారు. రోడ్డు గుంతలు పడడంతో ప్రయాణం చేయలేక పోతున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గంతలమయమైన రహదారులకు మరమ్మతులు చేయాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదు. దీంతో చేసేదేమీలేక ఆ రోడ్లపై ప్రయాణం చేస్తూ పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా ఈ రోడ్లకు మోక్షం కలిగేనా అని ఆయా గ్రామాల ప్రజల ఎదురుచూస్తున్నారు.

పట్టించుకునే వారులేరు



కమలాపురం క్రాస్ నుంచి కొప్పలకొండ, కేశవాపురం గ్రామాల మీదుగా సుమారు ఆరు కిలో మీటర్ల రోడ్డుపై తారు మొత్తం లేచిపోయింది. రోడ్డంతా గుంతలు ఏర్పడింది. దీంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేయాల్సి వస్తోంది. రోడ్డు నిర్మించాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఎవరూ స్పందించలేదు.

- కొండయ్య, కొట్టాలపల్లి

సొంతంగా గుంతలు పూడ్చా



మర్తాడు క్రాస్ నుంచి కోటంకకు ప్రయాణం నరక యాతనే. వాహనాలు వెళితే రోడ్డంతా దుమ్ము ధూళితో ఇబ్బందులు పడాల్సిందే. మర్తాడు నుంచి గార్లదిన్నె క్రాస్ వరకు సొంత డబ్బులతో మట్టితో లించా. రోడ్డు వేస్తే కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి వచ్చే భక్తులకు ఎంతో బాగుంటుంది.

- ఆవులక్రిష్ణయ్య, టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు

వాగ్దానాలు తప్ప చేసేది లేదు



ఏ పార్టీ నాయకులైనా ఎన్నికలు వచ్చాయంటే చాలు.... మా పార్టీని గెలిపిస్తే మీ సమస్యలు తీరుస్తాం... రోడన్నీ వేస్తామని అనేక వాగ్దానాలు ఇస్తారు. అధికారంలోకి వస్తే ఆ రోడ్లపై ప్రయాణం చేస్తారే తప్ప రోడ్లు వేయరు. రోడ్లు వేయకుంటే గ్రామాల్లోకి రాకుండా ప్రజాప్రతినిధులను అడ్డుకుంటాం.

- చెన్నారెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి

గ్రామాలను పట్టించుకోని గత వైసీపీ పాలకులు

● ఎమ్మెల్యే దగ్గుపాటి



డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో గ్రామ పంచాయతీలను సమస్యలకు నిలయాలుగా మార్చారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని రుద్రంపేట పంచాయితీ లో గురువారం మీ ఇంటికి మీ ఎమ్మెల్యే కార్యక్ర మాన్ని చేపట్టారు. ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి ఇంటింటికి తిరుగుతూ స్థానికులతో సమస్యలను తెలుసుకున్నారు. డ్రైనేజీలు, రోడ్లు, వీధిలైట్ల సమస్యలను వారు ఎమ్మెల్యే దృష్టికితీసుకెళ్లారు. రజకులకు దోబీ గాట్లు అదనంగా నిర్మించి వాటికి ప్రహరీ ఏ ర్పాటు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. రుద్రంపేట- తగరకుంట వెళ్లే రోడ్డును కేవలం కంకర వేసి వదిలే శారని, సీఎం చంద్రబాబు సహకారంతో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో సమస్యలను ప్రాధాన్యత వారీగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ దివాకర్, ఈఓఆర్డీ వెంకటనాయుడు, పంచాయతీ కార్యదర్శి హిదయతుల్లా, జనసేన నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బాబురావు, ఇమామ్‌హుస్సేన్, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌యాదవ్, రజక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పరమేశ్వరన్, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వప్న, అధికార ప్రతినిధి తేజస్వినీ, పంచాయతీ నాయకులు శ్రీనివాస రెడ్డి, భాష, ఈడిగ నాగభూషణం, వెంకటరాముడు, కదిరప్ప, బాలప్ప, నాగ, అంజి, ఆది, వెంకటేశ్వర్‌రెడ్డి, మున్వర్, పోతలయ్య, అశోక్, హరి పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించండి

● ప్రిన్సిపల్ సెక్రటరీకి ఎమ్మెల్యే వినతి



విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అర్బన్ నియోజకవర్గంలోని పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్‌ను ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ కోరారు. స్థానిక ఆర్‌డీటీ అతిథి గృహంలో గురువారం ఆయన్ను కలిశారు. శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అనంతరం పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులు ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో తరగతి గదులు, మరుగు దొడ్లు, తాగునీటి సమస్య ఉందన్నారు. గత ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు విధించిన నిబంధనలతో చాలా ఇబ్బందులు పడ్డారని, వాటిని సడలించి, నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందేలా ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఇందుకు కోన శశిధర్ సానుకూలంగా స్పందించారు.

డ్రైల్యాండ్ హార్టికల్చర్ పరిమితి పెంచాలి

● కేంద్రజలశక్తి అభియాన్ అధికారులకు రైతుల వినతి



సమీక్ష నిర్వహిస్తున్న కేంద్రజలశక్తి అభియాన్ నోడల్ ఆఫీసర్ అరులానందన్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ఉపాధి పథకం కింద డ్రైల్యాండ్ హార్టికల్చర్ పరిమితిని 5ఎకరాల నుంచి పదెకరాలకు పెంచాలని కేంద్ర బృందానికి రైతులు విన్నవించారు. జిల్లా పర్యటనలో భాగంగా తొలిరోజు గురువారం ఉదయం స్థానిక డ్వామా హాల్‌లో ఆయాశాఖల అధికారులతో కేంద్ర జలశక్తి అభియాన్ నోడల్ ఆఫీసర్ అరులానందన్, శాస్త్రవేత్త షరీఫ్‌ఖాన్ సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. జిల్లాలో ఉపాధి హామీ, వాటర్‌షెడ్ పనులు రైతాంగానికి, జిల్లా ప్రజలకు ఉపయోగకరంగా, ఫలప్రదంగా ఉండాలన్నారు. జిల్లాలో భూగర్భజలాల పెంపు, పచ్చదనం పెంపుపైనే ప్రత్యేకదృష్టి సారించాలని తెలిపారు. ప్రతి వర్షపు నీటి బొట్టును ఇక్కడే ఇంకింపచేసి, నీటి సంరక్షణ పనులు విరివిగా చేయాలని సూచించారు. కరవు నివారణ చర్యలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని వివరించారు. చెరువుల పటిష్టత, పూడికతీత, ముళ్లచెట్ల తొలగింపు చేపట్టి నీటి నిల్వ సామర్థ్యం పెంచాలన్నారు. అనంతరం బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లి, గార్లదిన్నె మండలం బూదేడు, శింగనమల మండలం వెస్ట్‌నరసాపురం గ్రామాల్లో పర్యటించి, ఉపాధి, వాటర్‌షెడ్ పనులను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. డ్రైల్యాండ్ హార్టికల్చర్ పరిమితిని పదెకరాలకు పెంచాలని అధికారులకు రైతులు విన్నవించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సలీంబాషా, వాటర్‌షెడ్ ఏపీడీ సుధాకర్‌రెడ్డి, ఏపీడీలు విజయ్‌కుమార్, శైలజ, అయేషా, అనురాధ, మైనర్ ఇరిగేషన్ ఎస్‌ఈ విశ్వనాథ్‌రెడ్డి, అటవీశాఖ, హార్టికల్చర్, ఏపీఎంఐపీ, అగ్రికల్చర్, భూగర్భజల శాఖ అధికారులు పాల్గొన్నారు.

● గార్లదిన్నె: జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి సురక్షిత నీరు అందించాలన్నదే ప్రధాని నరేంద్రమోదీ లక్ష్యమని వాస్ ఎక్స్‌పర్ట్ కేంద్రం సభ్యులు డాక్టర్ కుల్‌శ్రేష్ట, జాలి అన్నారు. మండల పరిధిలోని ఓబుళాపురం గ్రామంలో గురువారం జలజీవన్ మిషన్ పథకం ద్వారా సురక్షిత నీటి సరఫరా విధానాన్ని వారు పరిశీలించారు.ఓబుళాపురాన్ని హర్ ఘర్ జల్ గ్రామంగా ప్రకటించారు. కార్యక్రమంలో సర్పంచు సుబ్బమ్మ, ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఈఓఆర్డీ దామోదరమ్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే గార్లదిన్నెలోని ఉన్నత పాఠశాల అవరణం లో ఉపాధి పథకం ద్వారా రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ పనుల ను గురువారం కేంద్రం సభ్యులు అరులానందన్, షరీఫ్ పరిశీలించారు. పనులు నాణ్యంగా ఉన్నాయిని సంతృప్తి వ్యక్తం చేశారు. ఏపీడీలు శైలజ, విజయ్‌కుమార్, సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ యోగానందరెడి తదితరులు పాల్గొన్నారు.

టీచర్లు బలవుతున్నా శిక్షణ రద్దుచేయరా..?

● ఏపీటీఎఫ్ నాయకుల నిలదీత

అనంతపురం విద్య, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): టీచర్లు బలవుతున్నా రెసిడెన్షియల్ శిక్షణ ఆపకపోవడం తగదని ఏపీటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. ఆ సంఘం నాయకులు గురువారం ఏపీటీఎఫ్ భవన్‌లో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశులు, ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎస్‌జీటీలు, హెచ్‌ఎంలు, మండల విద్యాశాఖాధికారులు చాలా చోట్ల వందలాది కిలో మీటర్లు ప్రయాణించి శిక్షణకు వెళ్తున్నారన్నారు. గతంలో ఒక ప్రధానోపాధ్యాయుడు మరణించా రన్నారు. దీనిపై సంఘాల నేతలు ఖండిస్తే...రద్దు చేస్తామని అధికారులు మాట ఇచ్చార న్నారు. తాజాగా విజయనగరం జిల్లాలో హెచ్‌ఎం శ్రీనివాసులు తీవ్ర ఒత్తిడికి గురై గుండెపోటుతో మరణించారన్నారు. ప్రభుత్వం వెంటనే రెసిడెన్షియల్ శిక్షణను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తే...సహించేది లేదన్నారు. సంఘం నాయకులు సతీష్‌కుమార్, సర్దార్ వలి, వెంకటరమణ, లక్ష్మినారాయణ, హిమగిరి, ప్రసాద్, తిప్పేస్వామి, రామ్మూర్తి, సుహేల్, కలీముల్లా పాల్గొన్నారు.

సాగునీటికి రూ.7వేల కోట్లు కేటాయించాలి

అనంతపురం కల్చరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి వనరుల అభివృద్ధికి రూ.7 వేల కోట్లు నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నల్లప్ప డిమాండ్ చేశారు. జిల్లా డీఆర్సీ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన జిల్లా ఇన్చార్జి మంత్రి టీజీ భరత్‌ను ఆయన గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో ఇనుము, ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలన్నారు. ఉమ్మడి జిల్లాలో తాగునీటి పథకాలను పూర్తిచేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, నాగేంద్రకుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

సాయపడే గుణం అలవర్చుకోవాలి



పాల్గొన్న విద్యార్థులు, స్కూల్ సిబ్బంది

అనంతపురం విద్య, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బాల్యం నుంచి తోటి వారికి సహాయపడే గుణం అలవర్చుకోవాలని నారాయణ ఏజీఎం రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ అస్మాఖాన్ పేర్కొన్నారు. ద్వారకానగర్‌లోని నారాయణ బ్రాంచ్‌లో గురువారం థ్యాంక్స్ గివింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజీఎం, ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ స్పందించే గుణం అలవర్చుకోవాలన్నారు. సాయం చేసే గుణం పిల్లల్లో అలవర్చాలనే ఉద్దేశంతో థ్యాంక్స్ గివింగ్ డే ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో ఏవో రవీంద్ర బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన బధిరుల క్రికెట్ టోర్నీ



టోర్నీ విజేత ఒడిశా జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బధిరుల జాతీయ స్థాయి అండర్-19 క్రికెట్ టీ20 చాంపియన్‌షిప్ పోటీల్లో ఒడిశా జట్టు విజేతగా నిలవగా, హర్యాణా రన్నరప్‌గా నిలిచింది. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్న బధిరుల నేషనల్ అండర్-19 క్రికెట్ టీ20 చాంపియన్‌షిప్ పోటీలు గురువారం ముగిశాయి. సెమీస్‌లో భాగంగా హర్యాణా, ఆంధ్రప్రదేశ్ జట్ల మధ్య మొదటి మ్యాచ్ జరగగా... 15ఓవర్లలో ఆంధ్రప్రదేశ్ ఆరు వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేసింది. అనంతరం బరి లోకి దిగిన హర్యాణా 14.4 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. దీంతో హర్యాణా ఫైనల్‌కు చేరింది. రెండో సెమీస్ మ్యాచ్‌లో ఒడిషా, మహారాష్ట్ర జట్లు తలప డగా... ఒడిశా 15ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 129పరుగులు చేసింది. జితన్ నాయక్ 50పరుగులు చేశాడు. అనంతరం బరిలోకి దిగిన మహారాష్ట్ర 13.1ఓవర్లలో 70 పరుగులు మాత్రమే చేసి ఆలౌటైంది. ఫైనల్‌కు చేరి న హర్యాణా, ఒడిశా జట్లు మధ్య జరిగిన తుదిపోరులో ఒడి షా 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 138 పరుగులు చేసింది. బ్యాటర్ సనిత్‌శెట్టి 42 పరుగులు చేశాడు. అనంతరం బరిలోకి దిగిన హర్యాణా 17.4 ఓవర్లలో 96 పరుగులకు ఆలౌట్ అయ్యింది. 42 పరుగులతో గెలిచిన ఒడిషా ట్రోఫీ కైవసం చేసుకుంది. దీంతో విజేతగా నిలిచిన ఒడిశా, రన్నరప్‌గా నిలిచిన హర్యాణా జట్లకు బధిరుల క్రికెట్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు సుమిత్‌జైన్ చేతుల మీదుగా బహుమ తులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీటీ అనంత అకాడమీ మేనేజర్ శ్రీదేవి, జిల్లా మేనేజర్ దేవరాజ్, బధిరుల క్రికెట్ సంఘంరాష్ట్ర కార్యదర్శి నాగరాజు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

1న రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్-2024 పోటీలు డిసెంబరు 1వ తేదీన జిల్లా కేంద్రంలోని రామచంద్రనగర్‌లో ఉన్న సెయింట్ అగస్టీన్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు అనంతపురం జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి రవిరాజు తెలిపారు. ఈ మేరకు గురువారం రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. అండర్-8, 10, 12, 14 బాల, బాలికల కు క్యాటగిరీలలో పోటీలు ఉంటాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి 13జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారన్నారు. విజేతలకు నగదు, ప్రోత్సాహక బహుమతులు, మెమొంటోలు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 9966333414ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కోచ్ రవి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నెరవేరిన సొంతింటి కల



ఎల్ నారాయణచౌదరికి స్వాగతం పలుకుతున్న లబ్ధిదారులు

చెన్నేకొత్తపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు సొంతింటి కల నెరవేరింది. ఎనిమిదేళ్ల నిరీక్షణ తరువాత లబ్ధిదారులు గృహప్రవేశాలు చేశారు. మండలంలోని బసినేపల్లి బస్టాప్ సమీపంలో గురువారం అట్టహాసంగా ఎన్టీఆర్ గృహప్రవేశాలు చేపట్టారు. టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య గృహాలను ప్రారంభించారు. పలువురు పేదలకు 2016లో అప్పట్లో మంత్రిగా ఉన్న పరిటాల సునీత ఇంటి స్థలాలు కేటాయించి, ఎన్టీఆర్ గృహాలను మంజూరు చేశారు. 30 మందికిపైగా లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టగా.. పలువురు ఇళ్లను పూర్తి చేసుకున్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే టీడీపీ సానుభూతి పరులు అని నెపం చూపి వారి గృహప్రవేశాలను అప్పట్లో అడ్డుకున్నారు. దీంతో వారు చేసేదిలేక మిన్నకుండిపోయారు. కూటమి అధికారంలోకి రాగానే కాలనీల్లో గృహాలకు మోక్షం లభించింది. ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేసు, నాయకులు పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్‌లో జేసీ తనిఖీలు

చెన్నేకొత్తపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక పౌరసరఫరాల స్టాక్ పాయింట్‌ను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. స్టాక్‌పాయింట్‌లోని నిల్వలను పరిశీలించారు. చౌకధాన్యపు డిపోలకు నిత్యవసర సరుకులను ఎంత మేరకు సరఫరా చేశారని స్టాకిస్టును అడిగి తెలుసుకున్నారు. గోదాములో సరుకులు నిల్వ చేస్తున్నందున శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో ఉంచిన సర్వే రాళ్లను ఆయన పరిశీలించారు. సర్వే రాళ్లపై జగన్ బొమ్మ, పేర్లను తొలగించే ప్రక్రియను పరిశీలించారు. దానిపై తహసీల్దార్ సురేశ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఫ్రీహోల్డ్ జరుగుతున్న తీరును పరిశీలించారు.

ఎస్కేయూ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

అనంతపురం సెంట్రల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూలో పని చేస్తున్న ఒక జూనియర్ అసిస్టెంట్(లక్ష్మీనారాయణ) గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం వర్సిటీలో కలకలం రేపింది. వర్సిటీ వర్గాల సమాచారం మేరకు.. జూనియర్ అసిస్టెంట్ల ఉద్యోగోన్నతి ప్రక్రియ కొనసాగుతోంది. గత టీడీపీ ప్రభుత్వంలో ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలు పాస్ అయినవారు ఉద్యోగోన్నతికి అర్హులు. ఎస్కేయూలో కూడా గత ప్రభుత్వంలో డిపార్టుటమెంటల్ పరీక్షలు నిర్వహించారు. ఏపీపీఎస్సీ పరీక్షల్లో ఫెయిల్ అయిన కొంతమంది ఉద్యో గులు ఎస్కేయూ పరీక్షల్లో పాస్ అయ్యారు. ప్రమోషన్‌ల విషయంలో ఈ పరీక్షల్లో ఫెయిల్ అయినవారిని వర్సిటీ యాజమాన్యం పరిగణలోకి తీసుకోలే దు. దీనిని ఖండిస్తూ పలువురు కోర్టుకెళ్లారు. తమకు అనుకూలంగా తీర్పువ స్తుందని అప్పటివరకు ప్రమోషన్‌లు ఇవ్వవద్దంటూ యాజమాన్యానికి విన్నవిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగ వర్గాలు రెండుగా చీలిపో యాయి. సమస్య చిక్కుముడులు విప్పేందుకు వర్సిటీ యాజమాన్యం ప్రత్యేక కమిటీని నియమించింది. కమిటీ కూడా ప్రభుత్వ నిబంధనల మేరకు ఏపీపీఎస్సీ నిర్వహించిన డిపార్ట్‌మెంటల్ పరీక్షల్లో పాస్ అయినవారే ప్రమోషన్‌కు అర్హులని నివేదిక సమర్పించింది. ఇక ప్రమోషన్‌రాదని ఆందోళనకు గురైన ఒక ఉద్యోగి(లక్ష్మీనారాయణ) రిజిస్ట్రార్ కార్యాలయానికి కెళ్లి పెట్రోలు పోసుకునేందుకు యత్నించారు. అప్రమత్తమైన అక్కడి సిబ్బం ది ఆయన్ను నిలువరించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఆయనను స్టేషన్‌కు తీసుకెళ్లారు. రేపు మాట్లాడదామని సర్దిచెప్పి ఆయన్ను ఇంటికి పంపించారు.

జిల్లాస్థాయి ఆర్చరీ జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ఆర్చరీ జట్లను గురువారం ఎంపిక చేశారు. స్థానిక విద్యారణ్యస్కూల్ ఆవరణలోని ఎంకే అకాడమీలో గురువారం జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన వారి వివరాలను జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీకృష్ణ, కార్యదర్శి శివకుమార్ తెలిపారు. ఇండియన్ రౌండ్ బాలుర విభాగంలో కార్తీక్‌కుమార్, అభినయ్‌కుమార్, అనీల్‌కుమార్, హరీష్ ఎంపిక కాగా.. బాలికల విభాగంలో సిరిసాహింతి, వినీల, రక్ష, యశ్వంతికుమారి ఎంపికయ్యారు. రికవరీ రౌండ్ బాలుర విభాగంలో యశ్వంత్‌రెడ్డి, మహబూబ్ బాషా, ప్రజ్వల్, సంతోష్, సాలెహా, వందన్, హర్ష, గురువర్ధన్, బాలికల విభాగంలో సుష్మిత, మైథిలి ఎంపికయ్యారు. వారు డిసెంబరు 3వ తేదీ నుంచి విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు నళిని, రాహుల్‌బాబు, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

క్లుప్తంగా..

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గుత్తిరూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వన్నేదొడ్డి గ్రామ శివారులో గల 44వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన రాధాకృష్ణ బైక్‌పై గుత్తికి బయలుదేరాడు. వన్నేదొడ్డి గ్రామ శివారులోకి రాగానే బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో రాధాకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత కుటుంబసభ్యులు మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకు దర్యాప్తు చేపట్టారు.

రేషన్ బియ్యం పట్టివేత

కూడేరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరుట్లపల్లిలో అక్రమంగా తరలిస్తున్న 30 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని గురువారం పోలీసులు పట్టుకున్నారు. బుక్కరాయ సముద్రం మండల కేంద్రానికి చెందిన నారాయణస్వామి కరుట్లపల్లిలో 30 ప్యాకెట్ల రేషన్ బియ్యం సేకరించి వాహనంలో తరలిస్తుండగా.. సమాచారం అందిందని, దీంతో వెంటనే దాడులు చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, అనంతరం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు మరమ్మతులను నాణ్యతగా చేపట్టండి

గుంతకల్లు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పాడైపోయిన ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులు నాసిరకంగా సాగుతున్నాయని, నాణ్యంగా చేపట్టాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి దౌల్తాపురం ప్రభాకర్ గురువారం ప్రకటనలో డిమాండ్ చేశారు. మరమ్మతు పనులను పార్టీ నాయకులతో కలిసి వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు. తారు రోడ్లను సక్రమంగా మరమ్మతు చేయడం లేదని ఆరోపించారు. నాణ్యతలేమిపై ప్రశ్నించగా కాంట్రాక్టరు నిర్లక్ష్యంగా సమాధానమిచారన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకుని మరమ్మతు పనులు నాణ్యతగా నిర్వహించేలా చూడాలని కోరారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కూడేరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉదిరిపికొండకు చెందిన వన్నూరప్ప (67) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆయన ఈ నెల 17వ తేదీన బైక్‌లో గ్రామ సమీపంలోని తోటకి వెళ్తుండగా గుర్తు తెలియ ని వాహనం ఢీ కొంది . దీంతో తీవ్రగాయాలవడంతో అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొం దుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతు డి కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు చెప్పారు.

మహిళ అదృశ్యం



బోయ రామాంజినమ్మ

విడపనకల్లు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్ తిమ్మాపురం గ్రామానికి చెందిన బోయ రామాంజినమ్మ(59) వారం రోజుల క్రితం అదృశ్యమైంది. ఈ మేరకు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆమె కుమారుడు సుధాకర్ ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ తన తల్లి బోయ రామాంజినమ్మకు గత కొన్ని రోజులుగా మతి స్థిమితం సరిగా లేదని, 20వ తేదీన మధ్యాహ్నం ఎవ్వరికి చెప్పకుండా ఉన్నట్టుండి ఎటో వెళ్లిపోయిందని అన్నారు. బంధువుల ఇళ్లల్లోనూ, పలుచోట్ల గాలించినా ఆచూకీ తెలియలేదన్నారు. దీంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు విడపనకల్లు పోలీసులకు సమాచారం అందివ్వాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలను శుభ్రంగా ఉంచుకోవాలి

యల్లనూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని, చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సీడీపీఓ భారతి తెలిపారు. మండలకేంద్రంలోని కోటవీధి అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం ఆమె సెక్టార్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ రిజిస్టర్లు, ఆన్‌లైన్ నమోదులు ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండేటట్లు చూసుకోవాలన్నారు. పౌష్టికాహార పంపిణీ సక్రమంగా చేయాలన్నారు. ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమెవెంట సూపర్‌వైజర్ రాజామణి ఉన్నారు.

నేడు లక్షబిల్వార్చన

తాడిపత్రి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారికి లక్షబిల్వార్చన జరగనుంది. ఈ సందర్భంగా ఉదయం 5గంటలకు పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, 10గంటలకు లక్షబిల్వార్చన, 12గంటలకు భక్తులకు స్వామివారి దర్శనం, 12:30గంటలకు అన్నప్రసాద వితరణ జరగనున్నట్లు అర్చకులు తెలిపారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం

రాయదుర్గంరూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపురం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం కార్తీకదీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చ కులు ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, నైవేద్య పూజలు గావించారు. సాయంత్రం ఆరు గంటలకు భక్తులు సామూహికంగా దీపాలు వెలిగించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బీఎస్ తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

పెన్నహోబిళం ప్రసాదం ఏదీ?

- ఆలయంలో లడ్డూ ప్రసాదం విక్రయాలు బంద్
- ఏడు నెలలవుతున్నా స్పందించని అధికారులు
- అసహనం వ్యక్తం చేస్తున్న భక్తులు

ఉరవకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చే స్వామి భక్తులకు లడ్డూ ప్రసాదం కరువైంది. గతంలో బహ్మోత్సవాల దాకా లడ్డూ ప్రసాదాన్ని కౌంటర్ల వద్ద అడపాదడపా విక్రయించేవారు. అయితే ఏడు నెలలుగా ఆలయంలో ప్రసాదం ఊసే లేకుండా పోయింది. 2021-22 నుంచి లడ్డూ ప్రసాదం టెండర్ల ప్రక్రియ నిలిచిపోయింది. ఆలయంలో ప్రసాదం బ్రాహ్మణులతో తయారు చేయించి, సిబ్బందితో విక్రయించేలా ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో అప్పట్లో తాత్కాలికంగా లడ్డూను తయారు చేయించి విక్రయించారు. శని, ఆదివారాలలో, పండుగ సమయాలలో ఆలయానికి వేలాది మంది భక్తులు వస్తూ ఉంటారు. కాగా ఏడు నెలలుగా లడ్డూ ప్రసాదం విక్రయాలు లేకపోవడంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. భక్తులు ఎంతో పవిత్రంగా భావించే లడ్డూ ప్రసాదం పట్ల దేవాదాయ శాఖ అధికారులు వ్యవరిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. లడ్డూ టెండర్ ద్వారా వచ్చే ఆదాయానికి గండి పడింది. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి లడ్డూ తయారి విక్రయాల కోసం టెండర్లు పిలవాలని భక్తులు కోరుతున్నారు. ఈ విషయంపై దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషునాయుడు వివరణ కోరగా ఔట్ సోర్సింగ్ ద్వారా అయినా సిబ్బందిని నియమించుకుని లడ్డూ విక్రయాలకు చర్యలు తీసుకోవాలని ఆదేశించామని తెలిపారు.



మూతపడిన లడ్డూ ప్రసాదం విక్రయ కేంద్రం

అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే

- కొనియాడిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు
- వర్ధంతి సందర్భంగా ఘన నివాళి



కళ్యాణదుర్గంలో జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు కొనియాడారు. సాంఘిక సంస్కర్త జ్యోతిరావుపూలే వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని ప్రజావేదికలో ఎమ్మెల్యే ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. పూలే భారత దేశంలో అంటరానితరం, కుల రహిత సమాజాన్ని కాంక్షిస్తూ ఉద్యమాలను నడిపారన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికోసం పాటుపడ్డారని, విద్యాభివృద్ధికి పెద్దపీట వేశారని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడిపత్రి: మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని పట్టణంలోని బీసీ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక దినసరి కూరగాయల మార్కెట్ వద్దనున్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు టంగుటూరి వెంకటేశ్వర్లు , పలువురు నాయకులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలో ఏపీటీఎఫ్ నాయకులు ఆర్‌ఎస్‌లో గల జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు స్థానిక కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గుంతకల్లు: పట్టణంలోని సీపీఎం నాయకులు స్థానిక పార్టీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి బీ శ్రీనివాసులు, పలువురు నాయకులు పాల్గొన్నారు. అలాగే వైసీపీ, బీఎస్పీ కార్యాలయాల్లో ఆ పార్టీ నాయకులు పూలేకు నివాళులర్పించారు.

యాడికి: మండలకేంద్రంలోని మార్కండేయస్వామి ఆలయంలో పద్మశాలీయులు జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పద్మశాలీ య సంక్షేమ అభివృద్ధి సంస్థ రాష్ట్ర డైరెక్టర్ పోతుల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

బెళుగుప్ప, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ చిన్న గౌస్, ఎస్ఐ శివ ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో గురువారం వారు ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం ప్రమాదకరమన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని సూచించారు. ఏఎస్ఐ రామదాసు, హెచ్‌సీలు బాలనరసింహులు, మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

అధికలోడుతో వెళితే కఠిన చర్యలు..

పుట్లూరు: మండలంలోని కోమటికుంట్ల గ్రామశివారులో అధిక లోడుతో ప్రయాణించే వాహనాలకు ఎస్ఐ హేమాద్రి జరిమానా విధించారు. అలాగే ఆటోల్లో పరిమితికి మించి వెళుతున్న ప్రయాణికులను దించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇలా వెళితే ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని హెచ్చరించారు. లైసెన్సులు లేకపోతే డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

బొమ్మనహాళ్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌నాయక్ కోరారు. స్థానిక జూనియర్ కళాశాలను గురువారం ఆయన సందర్శించి విద్యార్థుల సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటి వల్ల విద్యార్థులు చదువులకు ఇబ్బంది కలుగుతోందని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పెద్దపప్పూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని జూటూరు వద్ద ఉన్న పెన్నానది సరిహద్దు ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పట్టుకున్నట్లు ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. సమాచారం అందడంతో వెంటనే దాడులు చేసి ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నామన్నారు. అనంతరం తహసీల్దార్‌కు రెఫర్‌చేసినట్లు చెప్పారు.

శివసాయిబాబాను దర్శించుకున్న జేసీపీఆర్



శివసాయి ఆలయంలో జేసీపీఆర్

తాడిపత్రి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజీవనగర్ 5వరోడ్డులో ఉన్న శివసాయిబాబా మందిరాన్ని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం అన్ని ఏర్పాట్లను చేయాలని ఆలయ సిబ్బందికి సూచించారు. ఆలయ ప్రాంగణంలో ఆహ్లాదకరమైన వాతావరణం కోసం గ్రీనరీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కంపెనీ వారు గ్రీనరీకి సంబంధించిన పనులు చేపడతారని అన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకుడు ఎస్వీ రవీంద్రారెడ్డి ఉన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

తాడిపత్రి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చింతల వెంకటరమణ స్వామి ఆలయంలో గురువారం స్వామివారి హుండీ లెక్కింపు నిర్వహించినట్లు ఈఓ రామాంజనేయులు తెలిపారు. 2024 మార్చి 3 నుంచి నవంబరు 28 2024 వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకల్ని లెక్కించామన్నారు. రూ.9,21,152 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అర్చకులు కృష్ణస్వామి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం

గుంతకల్లు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ గ్రామాల్లో ఖాళీ అయిన ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుల్లో కొత్తవారిని నియమిస్తూ అపాయింట్‌మెంట్ లెటర్లను అందజేశారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో జరిగింది. ఇందులో టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి క్షేత్ర సహాయకులకు నియామక పత్రాలను పంపిణీచేశారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధి పథకంలో ఎటువంటి అవినీతికి తావులేకుండా, జాబ్‌కార్డుదారులందరికీ గరిష్ట పనిదినాలు లభించేలా ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేయాలని సూచించారు. మండలంలో 18 పంచాయతీల్లో 19 మంది నూతన ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించారు. నాగసముద్రం పెద్ద గ్రామ పంచాయతీ కావడంతో అక్కడ రెండు పోస్టులను భర్తీచేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు కదిరప్ప, టీడీపీ పట్టణాధ్యక్షుడు బండారు ఆనంద్, నాయకులు ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, పాల మల్లికార్జున పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం

- అధికారుల సమావేశంలో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తాడిపత్రి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అధికారులందరూ సమష్టిగా కృషి చేస్తేనే ఏదైనా అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని నివాసంలో గురువారం ఆయన నియోజకవర్గ పరిధిలోని పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఎంపీడీఓలు, మండల ఇంజనీర్లు, తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. తాడిపత్రిని ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలంటే అధికారులందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. అప్పుడే సాధ్యమవుతుందన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సమస్యల ను అడిగి తెలుసుకుని సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని సూచించారు. గ్రామస్థాయి అధికారులు గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలు రాకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. కొన్నిచోట్ల సిబ్బంది కొరత ఉన్నప్పటికీ అభివృద్ధికి ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయం ఏర్పాటుచేసుకుని సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని ఆయన అధికారులకు భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు రాకుండా చూసేబాధ్యత మనందరి పైన ఉందని, అలసత్వం వీడి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు.

మహిళ ఆత్మహత్య

బొమ్మనహాళ్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో రాధ(23) అనే మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. కర్నూలు జిల్లా పెద్దకడుబూరుకు చెందిన సిద్ధమ్మ కుమార్తె రాధకు ఉద్దేహాళ్‌కు చెందిన శరణప్పతో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. కాగా గురువారం పుట్టింటికి వెళతానని ఆమె కోరడంతో ప్రతి సారి పుట్టింటికి ఎందుకు వెళతావని భర్త మందలించాడు. ఇందుకు మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు భర్త శరణప్ప తెలిపారు. మృతురాలు తల్లి సిద్ధమ్మ తమ బిడ్డను భర్త, ఆడపడచు, అత్త కొట్టి చంపారని ఆరోపించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

పేదల సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం



ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేశ్వర్లు

బొమ్మనహాళ్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పని చేస్తున్నారని తూర్పు గోదావరి జిల్లా రాజవరం మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేశ్వర్లు అన్నారు. బొమ్మనహాళ్ మండలం నేమకల్లు గ్రామంలో సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను గురువారం ఆయన తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, కన్వీనర్ బలరాంరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కుమ్మరి మల్లికార్జున, నాయకుడు పయ్యావుల నాగరాజుతో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పర్యటనకు సంబంధించి తనను అబ్జర్వర్‌గా నియమించారని, ఇందుకు ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చానని తెలిపారు. పేదలకు పింఛన్ పంపిణీ చేయడానికి చంద్రబాబు నేమకల్లుకు వస్తున్నట్లు చెప్పారు. పేదల సంక్షేమానికి సీఎం అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సల్లాపురం బాబు, నాగరాజు, గాలి బసప్ప, బెల్లి హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

ఆయాలకు బకాయి వేతనాలు ఇవ్వాలి: సీఐటీయూ

రాయదుర్గంరూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలకు బకాయిపడ్డ వేతనాలను తక్షణమే అందించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బీ మల్లికార్జున డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా ఉన్న 80 ప్రభుత్వ పాఠశాలల్లో 97 మంది ఆయాలుగా పనిచేస్తున్నారని, వీరికి గత జూలై నుంచి వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదే విధంగా జూనియర్ కళాశాలలో పనిచేసే ఆయాలకు కూడా 8 నెలల నుంచి వేతనాలు ఇవ్వలేదని, అన్నాళ్లు వేతనాలు చెల్లించకపోతే ఈ ఆయాలు తమ కుటుంబాలను ఏ విధంగా పోషించుకుంటారని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయాలకు బకాయి వేతనాలను తక్షణమే అందించాలన్నారు. లేని పక్షంలో పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా ఉన్నటువంటి ఆయాలను కలుపుకుని మండల విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆయాలు ఎర్రమ్మ, అంజినమ్మ, సుజాత, శైలజ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి

బొమ్మనహాళ్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహారాన్ని బాలింతలకు, కిశోర బాలికలకు, పిల్లలకు క్రమం తప్పకుండా అందించాలని కణేకల్లు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఇన్‌చార్జి సీడీపీఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆమె క్లస్టర్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలలో రికార్డులు సక్రమంగా నమోదు చేస్తూ బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారాన్ని సక్రమంగా ఇవ్వాలన్నారు. ఏదైనా తేడాలు జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సూపర్‌వైజర్లు గీత, శాంతకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఎంఎంహళ్లికి ఆర్థిక మంత్రి రాక

కూడేరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎంఎంహళ్లి గ్రామానికి ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం వస్తున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. మండలకేంద్రంలో గురువారం నాయకులు పూజరి రాజు, దేవేంద్ర, వన్నూరుస్వామి, అక్కులన్న పోతులూరి, అక్కులన్న విలేకరులతో మాట్లాడారు. ఎంఎంహళ్లి నుండి ఆత్మకూరు మండలం సిద్దలాపురం గ్రామం వరకు రెండు కోట్ల వ్యయంతో నిర్మించిన తారు రోడ్డును మంత్రి ప్రారంభిస్తారన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఘనంగా మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠ అయిన మారెమ్మ

శెట్టూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కైరేవు గ్రామంలో గురువారం మారెమ్మ అమ్మవారి విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, కలశస్థాపన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు తొలుత ఆలయ ప్రాంగణంలో హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదమంత్రాల నడుమ, శాస్త్రోక్తంగా అమ్మవారి విగ్రహాన్ని, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు పొందారు.

శ్రీకృష్ణుడి విగ్రహ ప్రతిష్ఠ

రాయదుర్గంరూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చదంగొల్లలదొడ్డి గ్రామంలో కార్తీక మాసం సందర్భంగా ఏరినాగముత్తప్ప ఆలయంలో శ్రీకృష్ణుడి విగ్రహ ప్రతిష్ఠను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత అర్చకులు విగ్రహానికి గంగాజలంతో అభిషేకం చేశారు. అలాగే నవగ్రహాల పూజ, హోమాలు నిర్వహించారు. తర్వాత వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠ చేసి పూజలు జరిపారు. ా టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆలయ శిఖర కలశ ప్రతిష్ఠ

విడపనకల్లు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాళాపు రం గ్రామంలో దేవ మ్మ అమ్మవారి ఆ లయానికి కలశ ప్ర తిష్ఠను గురువారం ఘనంగా నిర్వహించారు. గత మంగళవారం నుంచి అర్చకులు గంగపూజ, గో పూజ, గణపతి పూజ, రక్షధారణ, కలశ స్థాపన, ప్రాతః కాల పూజ, జపములు, అభిషేకాలు, కలశ గ్రామోత్సవం, హోమాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ఆలయ శిఖర కలశ ప్రతిష్ఠను వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా చేపట్టారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు దేవమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బ్రహ్మసముద్రం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాల వెంకటాపురం గ్రామ పరిధిలో గల అటవీ ప్రాంతంలో పేకాటకేంద్రంపై గురువారం దాడులు చేసినట్లు ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు. అందులో పేకాటాడుతున్న ముగ్గురిని అరెస్టు చేశామని, వారి నుంచి రూ. 20550 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని చెప్పారు.

కమిటీ ఎన్నిక

రాయదుర్గంరూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రెడీమేడ్ గార్మెంట్స్ జాబ్‌వర్క్ అసోషియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బూదూరు తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడిగా దబ్బడి శివన్న, ప్రధాన కార్యదర్శిగా దబ్బడి నాగరాజు, కార్యదర్శులుగా రవిప్రకాష్, ఆనంద్‌తో పాటు మరికొంతమంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ రెడీమేడ్ గార్మెంట్స్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

వరికి కనీస మద్దతు ధర ప్రకటించాలి

కణేకల్లు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వరిపంటకు క్వింటాలుకు రూ. మూడు వేలు ధర ప్రకటించాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల వ్యాప్తంగా రైతులు పండించిన వరి ,పంటలను సీపీఎం, రైతు సంఘం నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కోరి నాగరాజు, రైతు సంఘం అధ్యక్షుడు జయచంద్రారెడ్డి మాట్లాడుతూ రైతులు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి వరిపంటను సాగుచేశారని, క్వింటాలుకు రూ. మూడు వేలు అందించి వారిని ఆదుకోవాలని కోరారు.

కంటివైద్యశిబిరానికి విశేష స్పందన

యాడికి, నవంబరు28(ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్, శంకర కంటి ఆసుపత్రి (బెంగళూరు) ఆధ్వర్యంలో రాయలచెరువులో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరానికి 80మంది రోగులు వచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారన్నారు. 26మందిని కంటి ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారని, వారిని బెంగళూరుకు తీసుకువెళ్లి ఆపరేషన్ల అనంతరం రాయలచెరువుకు తీసుకువస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సూర్యనారాయణ, సభ్యులు రవిప్రసాద్, సత్యనారాయణ, ఇస్మాయిల్, రామకృష్ణ, శంకర కంటి ఆసుపత్రి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బ్రహ్మసముద్రం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండ లంలో డిసెంబరులో జరుగబోవు సాగు నీటి సంఘం ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ సుమతి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా బుడిమేపల్లి గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి గ్రామస్థులతో సమస్యల గురించి చర్చించారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగిరెడ్డి, వీఆర్వో హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

గోశాల పునర్నిర్మాణానికి సన్నాహాలు

రూ.30లక్షలు విరాళం ఇవ్వడానికి ఓ భక్తుడి సమ్మతి

గుంతకల్లు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో గోశాల నిర్మాణానికి రూ.30లక్షలు ఇవ్వడానికి ఓ భక్తుడు సంసిద్ధతను వ్యక్తం చేశారు. ఈ ఆలయ ఆవరణలో ఉన్న గోశాల సక్రమంగా లేకపోవడంతో దానిని పునర్నిర్మించడానికి ఆలయ అధికారులు నిర్ణయించారు. కాగా ఆలయంలో ధార్మిక కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందిస్తానంటూ హైదరాబాద్‌లోని వట్టినాగులపల్లికి చెందిన పరమేశ్వర్ సింగ్ గతంలో ప్రకటించారు. దీంతో ఆలయ ఈఓ కే.వాణి సూచనల మేరకు దేవస్థాన అర్చకులు చక్రవర్తి, హరిచరణ్ గురువారం హైదరాబాద్‌కు వెళ్లి పరమేశ్వరసింగ్‌ను కలిసి మాట్లాడారు. ఆయన గోశాల నిర్మాణానికి రూ.30లక్షల దాకా వెచ్చించడానికి సుముఖత వ్యక్తం చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. దాదాపుగా 4,500అడుగుల విస్తీర్ణంతో గోశాలను నిర్మించనున్నట్లు వివరించారు. వితరణ చేయడానికి సుముఖత వ్యక్తం చేసిన పరమేశ్వరసింగ్‌కు ఆలయ ఈవో ధన్యవాదాలు తెలిపారు.

జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపిక

ఉరవకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపికయ్యారు. నంద్యాలలో ఈనెల 26, 27వ తేదీలలో జరిగిన అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో విద్యార్థులు రాజు, మురళి, హస్విక ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. త్వరలో కేరళలో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారని హెచ్‌ఎం రాజశేఖర్, పీడీ రాజేష్ తెలిపారు. అలాగే సైక్లింగ్, ఖో-ఖో క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యా ర్థులను కూడా అభినందించారు.



ప్రతిభాంత విద్యార్థులతో ఉపాధ్యాయులు